నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 16-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 275 పేజీలు: 4 వెల: రూ.1/-

వృద్ధాశ్రమాల నిర్వహణపై హైకోర్టు విచారణ

స్వయంగా పరిశీలించాలని అధికారులకు సూచన-కేసు 23కు వాయిదా

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వృద్ధాశ్రమాల్లో ఎలాంటి సదుపాయాలు లేవని న్యాయవాది వసుధ నాగరాజు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సోమవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. స్వచ్ఛంద సంస్థల ద్వారా వృద్ధాశ్రమాలు నడుస్తున్నారని పిటీషనర్ కోర్టుకు విన్నవించారు. నిధులు లేని వృద్ధాశ్రమాల్లో ఒక్కొక్కరి వద్ద నుంచి 60-13 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. వృద్ధాశ్రమాల్లో ఉన్నవారిని చూసుకోవడానికి సరిపడా సిబ్బంది లేరని తెలిపారు. పిటీషనర్ తరపున వాదనలు విన్న కోర్టు రాష్ట్రంలోని వృద్ధాశ్రమాల్లో ఏలాంటి పరిస్థితులు ఉన్నాయో నేరుగా వెళ్లి పరిశీలించాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. పిటీషనర్‌ను తీసుకెళ్లి ఓల్డ్ ఏజ్ హోమ్స్‌ను సందర్శించాలని తెలిపింది. వాస్తవిక పరిస్థితుల చూసి పూర్తి నివేదిక సమర్పించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. వృద్ధాశ్రమాల నిర్వహణ కోసం కావాల్సిన నిధులను కార్పొరేట్ కంపెనీలు, ఎన్జీవోల ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ(సీఎస్ఆర్) కింద సమకూర్చుకోవాల్సిందిగా కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాక తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ఉన్న వృద్ధాశ్రమాల ఎన్ని.. వాటిలో రిజిస్టర్ అయినవి ఎన్ని, కానివి ఎన్ని ఉన్నాయో తెలపాలన్నది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని సెక్రటరీ సోషల్ వెల్ఫేర్, ప్రిన్సిపల్ సెక్రటరీ చైల్డ్, అండ్ ఉమెన్ అధికారులను ఆదేశించించిది. తదుపరి విచారణనను ఈ నెల 23కు వాయిదా వేసింది.

పది రోజుల్లో రైతుబంధు : సీఎం కేసీఆర్

నియంత్రిత సాగుకు రైతుల నుంచి వంద శాతం మద్దతు
ఇప్పటికే 11 లక్షల ఎకరాల్లో విత్తనాలు
వారం పది రోజుల్లో రైతుబంధు డబ్బులు
యాసంగి పంటల కోసం కూడా వ్యవసాయ ప్రణాళిక!

హైదరాబాద్ జూన్15(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు నియంత్రిత పద్ధతిలో పంటసాగు చేయడానికి సిద్ధపడిన రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందనలు తెలిపారు. నియంత్రిత పంటల సాగు విధానం అమలు, రైతుబంధు పథకాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా పంటల సాగు పరిస్థితిపై సీఎం సమీక్షించారు.

జిల్లాల వ్యవసాయ అధికారులు సమర్పించిన నివేదికలను సీఎం పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన విధంగానే అన్ని జిల్లాల్లో రైతుల పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 11 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేసినట్లు అధికారులు సీఎంకు తెలిపారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి వందకు వంద శాతం మద్దతు లభించింది. రాష్ట్రంలో రైతులందరూ ప్రభుత్వం సూచించిన మేరకు నియంత్రిత పద్ధతిలోనే పంటల సాగుకు అంగీకరించి దాని ప్రకారమే విత్తనాలు వేసుకోవడానికి సిద్ధం కావడం హర్షణీయమని సీఎం అన్నారు. మార్కెట్‌లో డిమాండ్ కలిగిన పంటలనే వేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నియంత్రిత సాగు విధానం ప్రతిపాదించిందని సీఎం తెలిపారు.

రైతాంగం నియంత్రిత పద్ధతిలో పంటల సాగుకు సిద్ధమైనందున వెంటనే రైతులందరికీ రైతుబంధు సాయం అందించాలని అధికారులను కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని, రైతులు పెట్టుబడి డబ్బుల కోసం ఇబ్బంది పడొద్దు అని సీఎం సూచించారు. వారం పది రోజుల్లోగా రైతుబంధు సాయాన్ని రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. రైతుబంధు డబ్బులు ఉపయోగించుకుని వ్యవసాయ పనులను ముమ్మరంగా కొనసాగించాలని చెప్పారు. వర్షాకాలం పంటల కోసం ప్రణాళిక రూపొందించినట్లుగానే యాసంగి పంటల కోసం కూడా వ్యవసాయ ప్రణాళిక తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

టీకా రెడీ అంటున్న చైనా

ట్రయల్ రన్స్ పూర్తయ్యాయని ప్రకటన

బీజింగ్,జూన్15(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిని కట్టడి కోసం వ్యాక్సిన్ కనిపెట్టడానికి చైనాలోని ఔషధ తయారీ సంస్థ సినోవ్యాక్ బయోటెక్ చేస్తున్న ప్రయత్నాలు ఆశలు చిగురింపజేస్తున్నాయి. తమ ప్రయత్నాలు ఫలించి మందు మార్కెట్లోకి వస్తే వేల ప్రాణాలు నిలువరించిన వారమవుతామని ఆ సంస్థ ఇటీవల పేర్కొన్నది. తాము తయారు చేసిన టీకా సానుకూల ఫలితాలను ఇస్తున్నదని సినోవ్యాక్ బయోటెక్ తెలిపింది. మానవులపై ప్రయోగాత్మకంగా నిర్వహిం చిన ఈ టీకా మొదటి రెండు దశలు పూర్తి చేసుకుందని, కరోనా వ్యాక్స పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ టీకాను మొత్తం 743 మందిపై ప్రయోగించామని సినోవ్యాక్ పేర్కొన్నది. 18-59 ఏండ్ల మధ్య వయసు ఉన్నవారిపై ఈ టీకా ప్రయోగాలు చేసినట్లు వెల్లడించింది. టీకా తీసుకున్న 14 రోజుల తర్వాత వారిలోని 90 శాతం మందిలో కరోనా వైరస్‌తో పోరాడే యాంటీ బాడీలు ఉత్పన్నం అయ్యాయని స్పష్టంచేసింది. తమ వ్యాక్సిన్ తీసుకున్న వారికి తీవ్రస్థాయి దుష్ప్రభావాలు ఏమీ ఎదురుకాకపోవడం ఊరటనిచ్చే అంశమని, ఇక మూడో దశ ట్రయల్స్ దేశం బయట నిర్వహించాలనుకుంటున్నామని సినోవ్యాక్ బయోటెక్ వెల్లడించింది. ఇందుకోసం బ్రెజిల్‌లోని ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కాగా, కరోనాకు టీకాను కనుగొనేందుకు ప్రపంచవ్యాప్తంగా రెండు డజన్లకుపైగా పరిశోధనా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారత్‌లోమరింత తీవ్రం కానున్న కరోనా

గరిష్టస్థాయికి చేరుకున్న కేసులు
ఆస్పత్రుల్లో పడకలు వెంటిలేటర్లకు కొరత
ఐసిఎంఆర్ అధ్యయన వేదిక వెల్లడి



న్యూఢిల్లీ,జూన్15(ఆర్ఎన్ఎ): యావత్ ప్రపంచాన్ని కలవరపెడుతున్న కరోనా మహమ్మారి.. భారత్‌లో నవంబర్ మధ్య నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇప్పుడున్న కేసులు తారాస్థాయికి చేరుతాయని భావిస్తున్నారు. ఆస్పత్రుల్లో సౌకర్యాల కొరత కూడా ఏర్పడనుందని అంటున్నారు. అప్పుడు ఐసీయూ పడకలు, వెంటిలేటర్ల కొరత ఏర్పడొచ్చని పరిశోధకుల బృందం అంచనా వేసింది. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఏర్పాటు చేసిన ఆపరేషన్ రీసెర్చ్ గ్రూపునకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 8 వారాల లాక్‌డౌన్ వల్ల కరోనా గరిష్ఠస్థాయిని చేరుకోవడం 36-76 రోజులపాటు ఆలస్యమవుతోందని తెలిపారు. అదే సమయంలో ప్రజారోగ్య మౌలిక సదుపాయాల మెరుగుకు లాక్‌డౌన్ ఉపయోగపడిందని విశ్లేషించారు. ఇన్ఫెక్షన్ రేటును 69-97 శాతం మేర తగ్గించడానికీ లాక్డౌన్ ఉపయోగపడిందని లెక్కగట్టారు నిపుణులు. లాక్‌డౌన్ తర్వాత సుమారు 60 శాతం మేర ప్రజారోగ్య వ్యవస్థ పటిష్ఠమైందని తెలిపారు. ఈ ప్రజారోగ్య చర్యలు నవంబర్ మొదటి వారం వరకు డిమాండ్‌ను అందుకుంటాయని, అనంతరం కొరత ఏర్పడొచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత ఐసోలేషన్ పడకలు 5.4 నెలల వరకు, ఐసీయూ పడకలు 4.6 నెలలు, వెంటిలేటర్లు 3.9 నెలల పాటు సరిపోకపోవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు. ఒకవేళ లాక్‌డౌన్ విధించకపోయి, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టకపోయి ఉంటే ఎదురయ్యే డిమాండ్‌తో పోలిస్తే ఇది 83 శాతం తక్కువేనని తెలిపారు. అదే సమయంలో ప్రజారోగ్య వ్యవస్థను 80 శాతం మేర పెంచి ఉంటే ఈ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలయ్యేదని అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ మహమ్మారి కోసం ప్రజారోగ్య వ్యవస్థపై వెచ్చించే మొత్తం జీడీపీలో 6.2 శాతం ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు. ఇప్పటికే ఢిల్లీ లాంటి నగరాల్లో వైద్య సదుపాయాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్రహోంమంత్రి అమిత్ షా సమీక్షించి తోణ చర్యలకు ఉపక్రమించారు.

సుశాంత్‌ది ఆత్మహ్యతేనని నిర్ధారించిన పోస్టుమార్టమ్

ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసుల ఆరా

ముంబై,జూన్15(ఆర్ఎన్ఎ): ముంబైలోని బాంద్రా అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్య చేసుకున్న బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతదేహానికి పోస్ట్‌మార్టమ్ పూర్తయ్యింది. అతనికి పోస్ట్‌మార్టమ్ చేసిన డా. ఆర్ఎన్ కూపర్ మున్సిపల్ జనరల్ ఆసుపత్రి వైద్యులు సోమవారం పోస్ట్‌మార్టం ప్రాథమిక నివేదికను విడుదల చేశారు. సుశాంత్‌ది ఆత్మహత్యగానే ధృవీకరించారు. అయితే అవయవాల్లో విషపూరితాలు ఉన్నాయో లేదో పరీక్షించేందుకు నటుడి అవయవాలను జేజే ఆసుపత్రికి తరలించారు.

బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ముంబైలోని తన నివాసంలో ఉరి వేసుకుని చనిపోయిన విషయంలో ఎలాంటి పురోగతి లేదు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. సుశాంత్ సూసైడ్ చేసుకున్నట్లు ముంబై పోలీసులు చెబుతున్నారు. కానీ ఆ హీరో మరణంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా 34 ఏళ్ల వయసులోనే సుశాంత్ తన నివాసంలో ఆదివారం ఉరి వేసుకున్న విషయం తెలిసిందే. అతని ఇంట్లో ముంబై పోలీసులు యాంటీ డిప్రెషన్ మందులను స్వాధీనం చేసుకున్నారు. కానీ ఎలాంటి సూసైడ్ నోట్ కనిపించలేదు. మరోవైపు ఆయన మరణంపై చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సుశాంత్ కుటుంబీకులు వారి స్వస్థలమైన పాట్నా నుంచి ముంబైకు చేరుకున్నారు. ఇదిలా వుండగా రెండేళ్లు థియేటర్ ఆర్టిస్ట్‌గా కొనసాగిన సుశాంత్ 'కిసీ దేశ్ మే హై మేరా దిల్' సీరియల్‌తో బుల్లితెరపై తెరంగ్రేటం చేశాడు. అనంతరం 'కాయ్ పో చె' (2013) చిత్రం ద్వారా బాలీవుడ్‌కు పరిచయమయ్యాడు. అలా 'శుద్ధ్ దేశీ రొమాన్స్', 'పీకే', 'డిటెక్టివ్ బ్యోమకేష్ బక్షి' చిత్రాలు నటుడిగా అతడికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ జీవితం ఆధారంగా చేసిన 'ఎం.ఎస్. ధోనీ'తో దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకున్నాడు. ఆయన చివరిసారిగా 'చిచోర్' చిత్రంలో కనిపించాడు.

సిబిఐ విచారణ చేయాలన్న పప్పూయాదవ్

సుశాంత్‌ను మర్డర్ చేశారని జన్ అధికార్ పార్టీ చీఫ్ పప్పూ యాదవ్ ఆరోపించారు. పాట్నాలోని సుశాంత్ ఇంటికి వెళ్లిన పప్పూ యాదవ్.. అక్కడ మీడియాతో మాట్లాడారు. హీరో సుశాంత్.. ఆత్మహత్య చేసుకునే వ్యక్తి కాదన్నాడు. సుశాంత్ మరణం కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పాట్నాలో ఉన్న సుశాంత్ కుటుంబసభ్యులు కూడా హీరో మృతి పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. సుశాంత్ సూసైడ్ చేసుకున్నట్లు మేం భావించడం లేదని ఆ హీరో బాబాయ్ తెలిపారు. సుశాంత్ మరణం వెనుక ఏదో మిస్టరీ ఉన్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. మా వాడిని మర్డర్ చేశారని ఆయన ఆరోపించారు. ఎంఎస్ ధోనీ, చిచ్చోరే, కేదార్‌నాథ్, సోంచిడియా లాంటి ఫేమస్ చిత్రాల్లో సుశాంత్ హీరో పాత్ర పోషించాడు.

తమిళనాడులో మళ్లీ లాక్‌డౌన్

నాలుగు జిల్లాల్లో విధిస్తూ ఆదేశాలు

చెన్నై,జూన్15(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ఉధృతి అధికంగా ఉన్న నాలుగు జిల్లాలో మరోసారి పూర్తిగా లాక్‌డౌన్ విధిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ సోమవారం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు జిల్లాలో ఈనెల 19నుంచి 30 వరకు లాక్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. లాక్‌డౌన్ సమయంలో ఆయా జిల్లాల్లో ఉదయం 6గంటల నుంచి 2గంటల వరకు నిత్యావసరాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. 33శాతం ఉద్యోగులతోనే ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపింది. ప్రజారవాణాను పూర్తిగా నిలిపివేయాలని అధికారులను ఆదేశించింది. హోటళ్లు, రెస్టారెంట్లలో పార్సిళ్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది.

విమానాల్లో మధ్య సీట్ల భర్తీకి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ముంబై, జులై 15: విమానాల్లో మధ్య సీట్లను విమానయాన సంస్థలు భర్తీ చేసుకోవచ్చని బాంబే హైకోర్టు సోమవారం తెలిపింది. అయితే కరోనా వైరస్ నియంత్రణకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జారీ చేసిన మార్గదర్శకాలను మాత్రం తప్పక పాటించాలని పేర్కొంది. ఎయిర్ ఇండియా పైలట్ దేవెన్ కనాని తన పిటిషన్‌లో లేవనెత్తిన అభ్యంతరాలను న్యాయమూర్తులు ఎస్ జె కథవల్లా, ఎస్ పి తవాడేతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. మధ్య సీటును ఖాళీగా ఉంచకపోయినా ప్రయాణికుల రక్షణ కోసం విమానయాన సంస్థలు తగిన చర్యలు తీసుకోగలవని పేర్కొంది. కరోనా నేపథ్యంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను 'వందే భారత్ మిషన్'లో భాగంగా ఎయిర్ ఇండియా విమానాల్లో స్వదేశానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. అయితే విమానాల్లో మధ్య సీట్లను కూడా భర్తీ చేస్తూ భౌతిక దూరం నిబంధనను ఆ సంస్థ ఉల్లంఘిస్తున్నదని, దీంతో ప్రయాణికులకు కరోనా ముప్పు పొంచి ఉన్నదంటూ ఎయిర్ ఇండియా పైలట్ దేవెన్ కనాని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు సోమవారం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది.

కరోనా టెస్టులపై ప్రైవేట్ ఆస్పత్రులకు మార్గదర్శకాలు

కరోనా పరీక్షలకు రూ.2200 ఫీజు నిర్ణయం
ఐసీయూలో చికిత్స అందిస్తే రోజుకు రూ.7500
వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తే రోజుకు రూ.9 వేలు
తెలంగాణలో కమ్యూనిటీ వ్యాప్తి లేదు
-మీడియాకు వెల్లడించిన మంత్రి ఈటెల రాజేందర్

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే రాష్ట్రంలో కరోనా కేసులు ఎక్కువగా రావడం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. రాష్ట్రంలో కరోనా సామాజిక వ్యాప్తి లేదని ఐసీఎంఆర్ చెప్పిందని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు బాగున్నాయని ఐసీఎంఆర్ కూడా కితాబిచ్చిందన్నారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితులు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కరోనా చికిత్స, పరీక్షలకు సంబంధించి ఫీజులపై వైద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిపై హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పెరుగుతున్న కేసులతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందరికి వైద్యం అందించడం ఇబ్బందికరంగా మారింది. సమస్య తీవ్రతరం కాకముందే ముందస్తు చర్యల్లో భాగంగా ప్రైవేట్ ల్యాబ్‌ల్లో కరోనా పరీక్షల ఫీజులపై చర్చించారు. ప్రైవేట్ దవాఖానల్లో కరోనా పరీక్షలకు రూ.2200 ఫీజు నిర్ణయించామని చెప్పారు.

వెంటిలేటర్ లేకుండా ఐసీయూలో చికిత్స అందిస్తే రోజుకు రూ.7500, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తే రోజుకు రూ.9 వేలుగా నిర్ణయించామని వెల్లడించారు. యాంటీ డ్రగ్స్ కు ప్రత్యేక చార్జీలు వేసేలా నిబంధనలు రూపొందించారు. అంతేకాదు కరోనా టెస్టులు, పాజిటివ్ వివరాలు పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ఈ టెస్టులన్నీ డాక్టర్ సలహా ప్రకారమే టెస్టులు చేయాలన్నారు ఈటల. లక్షణాలు లేకపోతే టెస్టులు చేయవద్దన్నారు. రోజుకు 3,500 మందికి టెస్టులు చేయవచ్చన్నారు. కరోనా కట్టడికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. టెస్టులు చేయడం లేదనడం అబద్ధమని చెప్పారు.కరోనా లక్షణాలు ఉంటే ఒకపూట దవాఖానలో ఉంటారని, పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కరోనా లక్షణాలు లేనివారికి పరీక్షలు చేయరన్నారు. లక్షణాలు ఉన్నవారికే పరీక్షలు చేయాలని మార్గదర్శకాలు ఇస్తున్నామని తెలిపారు. కరోనా లక్షణాలు లేనివారు తప్పకుండా హోం ఐసోలేషన్ పాటించాలని చెప్పారు. ఎవరైనా ఏమాత్రం అనుమానం వచ్చినా పరీక్షలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతిరోజు 7500 మందికి పరీక్షలు చేసే సామర్థ్యం ఉందని ప్రకటించారు. కరోనా వల్ల దేశంలో ఇప్పటివరకు 10 వేల మంది మాత్రమే చనిపోయా రన్నారు. కరోనా పరీక్షల విషయంలో ఐసీఎంఆర్ సూచించిన గైడ్‌లైన్స్‌ను అమలుచేస్తున్నామని తెలిపారు. కరోనా నియంత్రణలో దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. కరోనాపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో కరోనా కట్టడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లాక్‌డౌన్‌ను అన్ని రాష్ట్రాల కన్న పకడ్బందీగా అమలు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య కార్యకర్తలు పరీక్షలు చేస్తారని వెల్లడించారు.

ఢిల్లీలో ప్రతి ఒక్కరికీ కరోనా టెస్టులు

అఖిలపక్ష భేటీలో కేంద్రమంత్రి అమిత్‌షా
టెస్టులు పెంచాలన్న విపక్షనేతలు

న్యూఢిల్లీ,జూన్15(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో అందరికీ కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. దేశంలో కరోనా పరిస్థితిపై సోమవారం అమిత్‌షా అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌తోపాటు ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా పార్టీలు తమ ఎజెండాలను పక్కనపెట్టి మరీ కరోనా టెస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశాయి. కాగా, సమావేశం ప్రారంభం కాగానే ఢిల్లీలో కరోనా కట్టడి కోసం ఇప్పటి వరకు కేంద్రం, రాష్ట్రం అమలు చేస్తున్న చర్యలను అమిత్‌షా అఖిలపక్షం ముందు పెట్టారు. కరోనా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడంలో అన్ని పార్టీలూ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అందరికీ కరోనా పరీక్షలు నిర్వహించాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ గట్టిగా డిమాండ్ చేసింది. అంతేకాకుండా, కరోనా బారినపడ్డ కుటుంబాలకు, కంటైన్మెంట్ జోన్లలో ఉన్న కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సహాయం అందించాలని కేంద్రాన్ని కోరింది. దేశ రాజధాని ఢిల్లీలో కరోనా ముప్పు క్రమంగా తీవ్రమవుతుండంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టిసారించారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై ఆదివారం కేంద్ర హోం మంత్రి హర్షవర్ధన్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్, సీఎం అరవింద్ కేజీవ్రాల్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిల్ కుమార్ చౌదురి, ఇతర పార్టీల నేతలు హాజరయ్యారు. ఢిల్లీలో కరోనా నిర్ధారణ పరీక్షలను రెండు రోజుల్లో రెట్టింపు చేయాలని, కంటెయిన్‌మెంట్ జోన్లలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కొద్దిరోజుల్లో కరోనా పరీక్షలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కరోనా రోగులకు చికిత్స అందించడానికి తక్షణమే 500 రైలు బోగీలను ఢిల్లీ ప్రభుత్వానికి ఇవ్వాలని నిర్ణయించారు. కంటెయిన్‌మెంట్ జోన్లలో కాంటాక్ట్ మ్యాపింగ్ చేపట్టడానికి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రతి వ్యక్తి ఆరోగ్యం గురించి సర్వే చేయనున్నారు. ఇదిలావుంటే సోమవారం మధ్యాహ్నం కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిని అమిత్ షా పరిశీలించారు.

నేపాల్‌తో బలమైన బంధం మనది

సమస్యలు ఉంటే చర్చలతో పరిష్కరించుకుంటాం
కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ,జూన్15(ఆర్ఎన్ఎ): నేపాల్ పై భారత్‌కు ఎలాంటి అపార్థాలు లేవని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత్- నేపాల్ బంధం రోటీ-బేటీ లాంటిదని.. దునియాలో ఏ శక్తీ విడదీయలేదని వ్యాఖ్యానించారు. చేశారు. సోమవారం ఉత్తరాఖండ్‌లో వర్చువల్ ర్యాలీలో ప్రసంగించిన రాజ్ నాథ్ సింగ్.. రెండు దేశాల మధ్య ఎలాంటి సమస్యలున్నా చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. నేపాల్ పట్ల భారతీయులకు ఎలాంటి చేదు భావాలు లేవన్నారు. లిపులేఖ్ పాస్ వరకు ఇండియా నిర్మించిన హైవే ఇండియా బార్డర్స్ లోనే ఉందని నొక్కి చెప్పిన ఆయన.. ఈ విషయంలో నేపాల్‌కు కొంత వ్యతిరేకత ఉందన్నారు. కానీ, తప్పకుండా చర్చల ద్వారా పరిషా్కరం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇండియా నిర్మించిన హైవే.. నేపాల్ ప్రజల్లో ఎదైనా అపార్థానికి కారణమైతే, అది చర్చల ద్వారా క్రమబద్ధీకరించబడుతుంది. నేపాల్ తో ఇండియాకు భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక సంబంధాలే కాదు.. ఆధ్యాత్మిక బంధం కూడా ఉంది. అలాంటప్పుడు ఇండియా, నేపాల్ మధ్య సంబంధాలు ఎలా విచ్ఛిన్నమవుతాయని రాజ్ నాథ్ అన్నారు. ఇండియాలో భాగమైన లిపులేఖ్, కాలాపానీ, లింపియధుర ప్రాంతాలు తమవేనని పేర్కొంటూ రూపొందించిన కొత్త మ్యాప్‌ను నేపాల్ పార్లమెంట్ శనివారం ఆమోదించిన విషయం తెలిసిందే. ఈ దశలో భారత్-నేపాల్ మధ్య తత్తెతిన అన్ని అంశాలను చర్చల ద్వారా పరిష్కరిస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేపాల్‌తో సామాజిక, చారిత్రక, సాంస్కృతిక సంబంధాలే కాకుండా ఆధ్యాత్మిక సంబంధాలను భారత్ పంచుకుంటుందని అన్నారు. గతంలో నాథులా పాస్ ద్వారా యాత్రికులు మానస్‌సరోవర్‌కు వెళ్లేవారని, భారత భూభాగంలో 80 కిమీ పొడవైన రోడ్డు నిర్మాణంతో మానస్‌సరోవర్‌కు కొత్త రహదారి అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ రహదారిపై నేపాల్‌లో సరైన అవగాహన కొరవడిందని, చర్చల ద్వారా ఈ అంశాన్ని సామరస్యంగా పరిష్కరిస్తామని రాజ్‌నాథ్ వెల్లడించారు.

మళ్లీ లాక్‌డౌన్ ఆలోచన లేదు

స్పష్టం చేసిన గుజరాత్ సిఎం

గాంధీనగర్,జూన్15(ఆర్ఎన్ఎ): గుజరాత్‌లో కరోనా పాజిటివ్ కేసులు పెరిగిపోతుండటంతో మళ్లీ కఠిన లాక్‌డౌన్ విధించే అవకాశం ఉందన్న వార్తలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కొట్టిపారేశారు.

రాష్ట్రంలో మరోసారి లాక్‌డౌన్ విధించే ప్రణాళిక ఏదీ తమ ప్రభుత్వం దగ్గర లేదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ లాక్‌డౌన్ విధించే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాన్ని కూడా రూపానీ తోసిపుచ్చారు. వాస్తవ విరుద్ధమైన ఇలాంటి ఊహాగానాలను ప్రజలు నమ్మొద్దని కోరారు. ఇదిలావుంటే, జూన్ 1 నుంచి నాన్ కంటైన్మెంట్ జోన్లలో లాక్‌డౌన్ సడలింపులు ఇవ్వడంతో జనజీవనం క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నదని ఆయన ఓ ప్రటకనలో పేర్కొన్నారు. వ్యాపారం, వాణిజ్య సంబంధ కార్యకలాపాలు పైతం పుంజుకుంటున్నాయని వెల్లడించారు. అయితే, కరోనా మహమ్మారిపై పోరాటం కొనసాగుతుందనీ, ప్రజలు కూడా ఈ వైరస్‌తో కలిసి బతకడం నేర్చుకోవాలని రూపానీ సూచించారు.

కర్నాటక నుంచి ఎపికి బస్సులు-కర్నాటక ఆర్టీసీ నిర్ణయం

బెంగళూరు,జూన్15(ఆర్ఎన్ఎ): కర్నాటక నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బస్సు సర్వీసులు పునరుద్ధరిస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆర్టీసీ వెల్లడించింది.

ఈ నెల 17 నుంచి విడతల వారీగా సర్వీసులు నడపనున్నట్లు పేర్కొంది. తొలివిడతలో బెంగళూరు నుంచి అనంతరపురం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, కల్యాణదుర్గం, రాయదుర్గం, కడప, ప్రొద్దుటూరు, మంత్రాలయం, తిరుపతికి సర్వీసులు నడుస్తాయని తెలిపింది. బళ్లారి నుంచి విజయవాడ, అనంతపురం, కర్నూలు, మంత్రాలయానికి, రాయచూర్ నుంచి మంత్రాలయానికి, షాపూర్ నుంచి మంత్రాలయం, కర్నూలుకు

కరోనాపై కిం కర్తవ్యం ?

నేటినిజం
మంగళవారం 16-6-2020

ఇంతకాలం లాక్‌డౌన్‌తో పాటు అనేక హెచ్చరికలు చేసిన ప్రభుత్వాలు ఇప్పుడు ఏం చేయబోతున్నా యన్నదే ప్రజలను వేధిస్తున్న సమస్య. కరోనా కట్టడికి తీసుకునే చర్యలు కానరావడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకున్నా అవి పెద్దగా ఫలితం ఇచ్చేవిగా ఉండడం లేదు. ప్రజలు కూడా బరితెగించి తిరుగు తున్నారు. కనీస రక్షణ చర్యలు పాటించక పోవడంతో కరోనా కట్టడి సాధ్యం కావడం లేదు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి భయపెడుతోంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 79లక్షలకుపైగా కేసులు నమోదు అవుతున్నాయి. వివిధ దేశాలు అన్నీ కూడా ఈ కరోనా బారిన పడి అసలు ఏం చే యాలో కూడా తెలియని పరిస్థితిలోకి వెళ్తున్నాయి. ఇక భారత దేశంలో 3లక్షల20వేలకు పైగా కేసులు నమోదు అయ్యాయి. మరణాల సంఖ్య కూడా అధికంగా ఉంటోంది. ఎందుకు ఇలాంటి పరిస్థితి వస్తోంది?... ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ను ఎత్తివేయడమే కారణమా?...అసలు ప్రజల్లో అవగాహనా బాధ్యతా లేకపోవడమే కారణామా అన్నది తెలియాలి. ప్రజలదే కారణమన్నరీతిలో ప్రభుత్వాలు వాదిస్తున్న తరుణంలో అసలైన నిర్ణయాలు తీసుకోవాల్సింది ఎవరు?...కేంద్రమా, రాష్ట్రమా, ప్రజల చేతుల్లో ఉందా?.. ప్రస్తుతం మళ్లీ కేంద్ర ప్రభుత్వం కూడా లాక్‌డౌన్‌ను కొనసాగిస్తే మంచిదా?...ఒక వేళ కొనసాగించాల్సిన పరిస్థితి వస్తే ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంట ాయన్న డైలామాలో కూడా ప్రభుత్వాలు ఉన్నాయి. లాక్‌డౌన్ ప్రకటించి నప్పుడు ప్రభుత్వాలు చెప్పిన మాటలు మరచి ..ఇప్పుడు ప్రజలను గాలికి వదిలేయడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్న మవుతోంది. ఇక మా వల్ల కాదు.. మీ ప్రాణాలు మీరే కాపాడుకోండని ప్రభుత్వం చేతులెత్తేస్తే ప్రజలు ఏం కాను అన్న భయం వెన్నాడుతోంది. ఎందుకంటే దీనికి అవసరమైన చికిత్స లేకపోవడం, మందులు కూడా రాకపోవడంతో ప్రజల్లో సహజంగానే భయాలు పెరిగాయి. తొలిదశలో లాక్‌డౌన్‌కు సహకరించిన ప్రజలు.. ఇప్పుడు ఆంక్షలు సడలించడంతో బాధ్యతారహితంగా వ్యవహరి స్తున్నారు. అటు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, ఇటు ప్రజల్లో బాధ్యతారహిత ధోరణితో వైరస్ అదుపు తప్పుతోంది. ప్రారంభ దశలో వలస కార్మికుల సమస్యను విస్మరించి హడావుడిగా లాక్‌డౌన్ ప్రకటించిన ప్రభుత్వాలు.. ఆ తర్వాత వలస కార్మికు లను సొంత రాష్ట్రాలకు పంపడం వల్ల వైరస్ విస్తృతికి కారణం అయ్యాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దేశ వ్యాప్తంగా ఇప్పుడు వైద్యులు కూడా వైరస్ బాధితులుగా మారారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది పలువురికి వైరస్ సోకింది ఫలితంగా ఇతరత్రా వైద్యం కోసం ఆసుపత్రులకు కూడా వెళ్లలేని దుస్థితి దాపురించింది. చెత్తలో శవాలా? అంటూ ఏకంగా సుప్రీం కోర్టుసైతం ధర్మాగ్రహం వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటే ఎంత దారుణంగా ఉందో అర్థం చేసు కోవచ్చు. కరోనాని కట్టడి చేయడానికై రెండు నెలల క్రితం లాక్‌డౌన్ ప్రకటి ంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలు ప్రజల ముందు కొచ్చి ప్రజలను ఎంతో ఉత్తేజితం చేశాయి. మై..హూంనా.. అంటూ ఉపన్యాసాలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు అన్ని రాష్ట్రాల సిఎంలు కూడా భయమక్కర్లే దన్నారు. దేశంలో కరోనా మరింతి విజృంభి స్తున్న దశలో అసలు చికిత్సలు జరగడం లేదని, రోగులను పట్టించుకోవడం లేదని, శవాలను దారుణంగా తీసిపడేస్తు న్నారని...శవాలను తారుమారు కూడా చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. కరోనా విస్తరిస్తున్నప్ప టికీ ఏమీ పట్టనట్టుగా వ్యవ హరిస్తున్నారు. అధికా రులు, ప్రజాప్రతినిధులకు కూడా కరోనా సోకే ప్రమాదం వచ్చింది. తమిళ నాడులో ఓ ఎమ్మెల్యే కరోనాకు బలయ్యారు. తెలంగాణలో ఇద్దరు ఎమ్మెల్యే లకు కరోనా సోకింది. ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగంలో పలువురికి కరోనా సోకి పాలనే కుంటుపడే పరిస్థితి ఏర్పడింది. దేశంలో లాక్‌డౌన్ ప్రకటించిన సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ.. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలన్న భావనను దేశ ప్రజలలో వ్యాపింపజేయగలిగారు. తొలుత కరోనా బాధితుల ను కాపాడుతున్న వైద్యులకు, ఇతర సిబ్బందికి చప్పట్ల ద్వారా ప్రోత్సాహం ఇవ్వాలని ప్రధాని ఇచ్చిన పిలుపునకు ప్రజలంతా స్పందించారు. ఆ తర్వాత ఇళ్లల్లో లైట్లు ఆర్పేసి కొవ్వొత్తులు వెలిగించ మంటే.. ఆ పని కూడా చేశారు. మరోదఫా వైద్య సిబ్బందిపై పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమాలన్నీ మొదట్లో ప్రజలను కూడా ఆకర్షి ంచాయి. నెలన్నర గడిచేసరికి ప్రభుత్వాల ఆదాయం పడిపోతున్న విష యాన్ని గ్రహించి మద్యం దుకాణాలను తెరవడానికి అనుమతిం చారు. లాక్‌డౌన్ సడలిం చారు. తొలుత ప్రజలను ఉద్దేశించి పదేపదే ప్రసం గించిన ప్రధాని మోదీ.. ఇప్పుడు కరోనా వైరస్ గురించి మాట్లాడటం లేదు. వైరస్ కట్టడి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నట్టుగా చేతులు దులుపుకొన్నట్లు కనిపిస్తోంది. జాతీయ విపత్తు నిర్వహణ చట్టం కింద రాష్ట్రాలకు నిర్దుష్ట మైన ఆదేశాలు ఇచ్చే అధికారం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. మెడికల్ ఎమర్జెన్సీని విధించి పెద్ద ఎత్తున చికిత్సలకు ఆస్పత్రులను ఏర్పాటు చేయాల్సిన కేంద్రం చేష్టలుడిగి చూస్తోంది. ఇప్పుడు కరోనా వైరస్ కబళిస్తున్నప్ప టికీ కనీసం గుర్తిం చడానికి కూడా నిరాకరిస్తున్నట్టు కనబడుతున్నారు. అనుమానితులకు పరీక్షలు నిర్వహిం చడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. తెలం గాణలో అయితే కరోనా చేయిదాటే పరిస్థితికి చేరింది. ప్రజా ప్రతినిధులు, వారి సహాయకులకు వైరస్ సోకుతోంది. ఇప్పుడు రాష్ట్రంలో కరోనా వైరస్ లేనే లేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున టెస్టు చేయాలని తాజాగా ఆదేశాలు ఇచ్చారు. అయితే దీనిపై జాతీయ విధానం కావాలి. కేంద్రం కరోనా కట్టడికి కఠిన చర్యలు తీసుకుని వాటిని అమలు చేసే బాధ్యతను రాష్ట్రాల ద్వారా చేయిస్తే తప్ప ఈ ఉ పద్రవం నుంచి బయటపడలేం. అందుకు అత్యవసర వైద్య విధానం అవలంబించక తప్పదు. తదుపరి ఏం చేయబోతున్నారన్న ప్రజల ఆందోళనకు సమాధానం చెప్పాలి.

తడిపొడి చెత్తను వేరు చేయాలి

సర్పంచ్‌లు బాధ్యత తీసుకుంటేనే మంచిది: కలెక్టర్

సంగారెడ్డి,జూన్15(నేటినిజం ప్రతినిధి): భావితరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందిద్దామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.హన్మంతరావు అన్నారు. పారిశుధ్య నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణ, డంపుయార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతూ తడి, పొడి చెత్తలను విడివిడిగా డబ్బాల్లో వేయాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా వేయడానికి ఇంటింటికీ చెత్తబుట్టలను ఇచ్చామని గుర్తుచేశారు. వాటిలో ఒక దానిలో తడి చెత్త, మరొక దానిలో పొడి చెత్తను వేయాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయ సంఘాల మహిళలు ఇంటింటికీ తిరిగి చెత్తను వేరుచేయడం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. అలాగే 20వ తేదీ వరకు తడి, పొడి చెత్తలను వేరుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేయకుంటే మొదట రూ.50 చొప్పున, తర్వాత రూ.500 చొప్పున, అనంతరం రూ.1000 చొప్పున జరిమానా విధించడానికి తీర్మానం చేశారు. గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సర్పంచ్‌లను అభినందించారు. తడి, పొడి చెత్తను వేరు చేయకుంటే జరిమానా విధించాలని కలెక్టర్ హన్మంతరావు అధికారులను ఆదేశించారు. తడి, పొడి చెత్తను వందశాతం వేరు చేసి డంపుయార్డుకు తరలించేలా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందించు కోవాలని సూచించారు. ఈ నెల 30లోగా డంపుయార్డుల నిర్మాణం పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి

ఖమ్మం,జూన్15(ఆర్ఎన్ఎ): వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు, చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్వీకర్ణన్ ఆదేశించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రతను పాటించాలన్నారు. డెంగ్యూ,

మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు.

హరితహారం కోసం మొక్కల సంరక్షణను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని గ్రామస్తులకు తడిపొడి చెత్తబుట్టలను పంపిణీ చేశామన్నారు. హరితహారంలో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు శాఖల వారీగా కేటాయించిన లక్ష్యం ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

16వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరగనున్నందున పాల్గొనే అధికారులు సంబంధిత అంశాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేశారు.

మరోమారు లాక్‌డౌన్ విధించం: కేజ్రీవాల్



న్యూఢిల్లీ,జూన్15(ఆర్ఎన్ఎ): రానున్న రోజుల్లో ఢిల్లీలో మరోసారి లాక్‌డౌన్ విధించే ఆలోచనేదీ లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ సోమవారం స్పష్టం చేశారు. చాలామంది ప్రజలు ఢిల్లీలో మరోసారి లాక్‌డౌన్ విధిస్తారన్న ఊహల్లో ఉన్నారని, కానీ అలాంటి ప్రణాళిక లేవీ లేవని ట్విట్టర్‌లో సీఎం కేజీవ్రాల్ పేర్కొన్నారు. ఉదయం కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమ్‌ఆద్మీపార్టీ ఎంపీ సంజయ్ సింగ్ హాజరై ఢిల్లీతోపాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని దవాఖానల్లో పడకల సంఖ్య పెంచాలని కోరినట్లు వెల్లడించారు.

పినరయ్ విజయన్ కూతురుకు మళ్లీ పెళ్లి

-నిరాడంబరంగా పెళ్లి కార్యక్రమం

తిరుపతి,జూన్15(ఆర్ఎన్ఎ): కేరళ సీఎం పినరయి విజయన్ కూతురు వీణా తయికండియిల్ ..సోమవారం రెండవ పెళ్లి చేసుకున్నది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆమె.. డీవైఎఫ్ఐ అధ్యక్షుడు పీఏ మొహమ్మద్ రియాస్‌ను పెళ్లి చేసుకున్నారు. ఉదయం తిరువనంతపురంలో ఈ వివాహ వేడుక చాలా సాదాసీదాగా జరిగింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సీఎం అధికార నివాసంలో కేవలం కొద్ది మంది అతిథుల మధ్య వేడుక నిర్వహించారు. బెంగుళూర్‌లోని ఓ చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీకి అధిపతిగా వీణా పనిచేస్తున్నది. ప్రస్తుతం ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఆమె హెడ్‌గా ఉంది. మాజీ ఐపీఎస్ ఆఫీసర్ పీఎం అబ్దుల్ ఖదీర్ కుమారుడే రియాస్. చిన్ననాటి నుంచి రాజకీయాల్లో ఉన్న రియాస్.. ప్రస్తుతం డీవైఎఫ్ఐ అధ్యక్షుడిగా చేస్తున్నాడు. లోక్‌సభ ఎన్నికల్లో కోజికోడ్ నుంచి పోటీ చేసిన రియాస్.. కేవలం 838 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ ఇద్దరికీ ఇది రెండవ పెళ్లి. ఇద్దరూ 43 ఏళ్లు ఉన్నారు. రియాస్‌లో తొలిసారి 2002లో పెళ్లి చేసుకున్నాడు. 2015లో అతనికి డైవర్స్ అయ్యింది. రియాస్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఎం విజయన్ కూతురు వీణకు కూడా సంతానం ఉన్నది. ఆమె 2015లో విడాకులు తీసుకున్నది.

పవనశక్తిని వాడుదాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

(15 జూన్ ప్రపంచ పవన దినం సందర్భంగా)

హైదరాబాద్, జూన్ 15:ప్రపంచ పవన శక్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా 15 జూన్ రోజున 'ప్రపంచ పవన దినం(గ్లోబల్ విండ్ డే)'ను నిర్వహిస్తూ, పిల్లలు, యువత మరియు పెద్దలకు పర్యావరణ హితమైన పవన శక్తి ఉత్పత్తి మరియు వినియోగ ఆవశ్యకతను వివరించే ప్రయత్నాలు చేస్తారు. సాంప్రదాయేతర తరగని పునరుత్పత్తి చేయగల శక్తి వనరులలో ముఖ్యమైనదిగా పవన శక్తిని భవిష్యత్ శక్తి వనరుగా భావించి వినియోగించుకోవలసిన మార్గాలను అన్వేషించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ రోజును ఆసరాగా చేసుకొని ఆన్‌షోర్ మరియు ఆఫ్‌షోర్ పవన శక్తి ఉత్పత్తి కేంద్రాలు, పవనశక్తి ఉపయోగాలు, ఉత్పత్తి సవాళ్ళు మరియు సదుపాయాలు, సెమినార్‌లు, విద్యాలయాలలో అవగాహనలు, పవన శక్తి ప్రదర్శనలు, పవన టర్బైన్‌ల వినియోగం, పవన శక్తి అదనపు ఆకర్షణలు లాంటి పలు అంశాలలో సంపూర్ణ అవగాహనలు కల్పిస్తారు. సాంప్రదాయ శిలాజ తరిగే ఇంధనాల వినియోగంలో దాగి ఉన్న పర్యావరణ సమస్యలకు సరైన సమాధా నంగా సాంప్రదాయేతర పవన, అలల, సౌర శక్తులను ఆచరణలోకి తీసుకురావలసి ఉంది. పవన శక్తిని భవిష్యత్ అవసరాలకు వాడుకోవాలనే సదుద్దేశంతో 2015లో ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్లు ఖర్చు చేయడం జరిగింది. పవన శక్తిని ఉత్పత్తి ప్రోత్సాహించేలా ప్రభుత్వ, స్వచ్ఛంధ మరియు పౌర సమాజానికి పలు సౌకర్యాలను కల్పిస్తూ, రాయితీలను ప్రకటించడం కూడా జరుగుతోంది. యూరప్‌లో 2007లో ప్రారంభించబడిన ప్రపంచ పవన దినాన్ని విశ్వవ్యాప్తంగా అన్ని దేశాలు 2009 నుండి నిర్వహిస్తున్నాయి. వీచే గాలిలో శక్తి దాగి ఉంటుంది. ఎక్కువ వాతావరణ పీడనం ఉన్న ప్రదేశం నుండి తక్కువ పీడనం గల ప్రదేశానికి గాలి వేగంగా వ్యాపిస్తుంది. ఈ రెండు ప్రదేశాల వాతావరణ పీడనాల వ్యత్యాసాలు పెరిగితే గాలి వేగంగా ప్రయాణిస్తూ శక్తి వనరుగా పని మారుతుంది. భూమిపై వివిధ ప్రదేశాలలో సూర్యరశ్మి తేడాలతో ఉష్ణోగ్రతలు వేరు వేరుగా ఉండటంతో వాతావరణ పీడనాలలో వ్యత్యాసాలు జనిస్తాయి. దీని ఫలితంగా గాలి వీస్తూ, పవన శక్తికి ఉత్పత్తికి దారిని సుగమం చేస్తాయి. సాధారణ పవనాలతో పాటు తుఫానులు, సునామీలు, హరికేన్‌లు, టార్నిడోల సందర్భాలలో గంటకు వందల కిలోమీటర్ల వేగంతో గాలులు వేస్తాయి. ప్రకృతి ప్రళయాలు జరిగినపుడు పవన శక్తిని తట్టుకోలేక ఇండ్లు, చెట్లు, విద్యుత్తు లైన్‌లు కూలిపోవడం కూడా జరుగుతుంది.వేగంగా విస్తరిస్తున్న పవన శక్తి వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పే చర్యలకు అన్ని దేశాలు ప్రాధాన్యతలను ఇస్తున్నాయి. కర్బన ఉద్గార ఇంధన వినియోగాన్ని తగ్గించుటలో పవన శక్తి మనకు మంచి ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. విశ్వవ్యాప్తంగా 651 జిడబ్ల్యు (గీగాబైట్) యూనిట్ల పవన శక్తి ఉత్పత్తి అవుతోంది. ఇందులో 2019లోనే ప్రపంచవ్యాప్తంగా 60 జిడబ్ల్యు యూనిట్ల పవన శక్తి ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పడం జరిగింది. ప్రపంచ దేశాలలో చైనా, అమెరికా, జర్మనీ, ఇండియా, స్పేయిన్, బ్రజిల్, ఫ్రాన్స్ మరియు కెనడాలు పవన శక్తి ఉత్పత్తి జాబితాలో ముందున్నాయి. ప్రపంచంలోనే "కంట్రీ ఆఫ్ విండ్స్"గా డెన్మార్క్ పిలువబడుతోంది.

గత 25 సంవత్సరాలుగా పవన శక్తి ఉత్పత్తికి భారత్ చేస్తున్న కృషిలో భాగంగా ప్రపంచ జాబితాలో నాలుగవ స్థానాన్ని ఆక్రమించి దూసుకుపోతోంది. 2020 గణాంకాల ప్రకారం భారత దేశంలో 37.7 జిడబ్ల్యు యూనిట్ల పవనశక్తి ఉత్పత్తి జరుగుతోంది. దక్షిణ, పశ్చిమ మరియు ఉత్తర భారతదేశ ప్రాంతాలలో పవన శక్తి ఉత్పత్తి అధికంగా జరుగుతోంది. దినదినం పవన శక్తి ఉత్పత్తి పెట్టుబడి ఖర్చు తగ్గుట వలన చవకగా వినియోగదారులకు అందుబాటులోకి వస్తోంది. మన దేశంలో అన్ని శక్తి ఉత్పత్తిలో 10 శాతం పవన శక్తి అందుబాటులోకి రావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పవన శక్తిలో 70 శాతం మే - సెప్టెంబర్ మాసాలలో ఉత్పత్తి చేయుటకు వాతావరణం అనుకూలిస్తున్నది. భారత దేశంలో తమిళనాడు రాష్ట్రం 9232 మెగావాట్ల పవన శక్తి ఉత్పత్తితో ముందంజలో ఉంది. గుజరాత్ (7204 మెగావాట్), మహారాష్ట్రా (4794 మెగావాట్), కర్నాటక (4753 మెగావాట్), రాజస్థాన్(4300మెగావాట్), ఆంధ్రప్రదేశ్ (4077 మెగావాట్), మధ్యప్రదేశ్ (2520మెగావాట్) మరియు తెలంగాణ (128 మెగావాట్) ఉత్పత్తుల జాబితాలో ముందున్నాయి. దేశంలోనే అత్యధిక సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటం హర్షదాయకం. పెనుగొండ, నల్లకొండ ప్రాంతాలలో పవన శక్తి మిల్లుల ద్వారా ఉత్పత్తి అధికంగా జరుగుతోంది. తెలంగాణలో పవన మరియు సౌరశక్తులను ఉత్పత్తి చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

పవన శక్తి ఉపయోగాలు అమూల్యమైనవి. పునరుత్పాదక శక్తిగా పవన శక్తి ఎన్నటికీ తరగని ప్రత్యామ్నాయ శక్తి వనరుగా భవిష్యత్తులో ఎల్లవేళల అందుబాటులో ఉండే వనరుగా గుర్తించబడింది. పర్యావరణానికి ఎలాంటి చేటు చేయని పవనశక్తి కాలుష్యాన్ని కలిగించదు. పర్యావరణానికి హాని చేసే శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుటలో పవనశక్తి సహకరిస్తుంది. అందరికి పవనశక్తి ఉచితంగా అందుబాటులో ఉంటుంది. పవన టర్బైన్‌లు తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తాయి. గుట్టలు, కొండలు, పర్వతాలు, సముద్రాలలో కూడా పవనశక్తిని ఉత్పత్తి చేయవచ్చు. పరిశ్రమల మరియు గృహ వినియోగానికి పవన శక్తిని వాడవచ్చు. దేశ మారుమూల ప్రాంతాలకు పవనశక్తిని అందుబాటులోకి తీసుకురావచ్చు. పవన శక్తి సాంకేతిక పరికరాలు చవకగా అందుబాటులో ఉన్నాయి. పవన టర్బైన్‌ల మెంటెనెన్స్ ఖర్చు చాలా తక్కువ. పవన శక్తి ఉత్పత్తి సులభం కాబట్టి చవకగా లభిస్తుంది. భవిష్యత్తులో ఉత్తమ శక్తి వనరుగా వాడే అవకాశం ఎక్కువ. భవిష్యత్తులో శక్తి భద్రతలో పవన శక్తి పాత్ర విశిష్టమైంది. పవనశక్తి రంగంలో లక్షల సంఖ్యతో ఉద్యోగాలు లభిస్తాయి.

పవన శక్తి ఉత్పత్తి మరియు వినియోగంలో కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. పవన శక్తి గాలి వ్యాప్తి మీదనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి నిరంతరం స్థిరంగా అందుబాటులో ఉండక హెచ్చు తగ్గులు ఉంటాయి. పవన టర్బైన్‌ల స్థాపనలో ఆర్థిక భారం ఎక్కువ. పవన టర్బైన్‌లు ఎక్కువ వేడిని మరియు శబ్దాన్ని చేయటంతో వన్యప్రాణులకు హాని కలుగవచ్చు. శబ్దకాలుష్యానికి కారణమైన పవన టర్బైన్‌లతో చూపరులకు దృశ్య కాలుష్యం కూడా జరుగవచ్చు. భూతాపానికి కారణమైన హరిత గృహ ప్రభావానికి దూరంగా, సులభంగా ఉత్పత్తి మరియు వినియోగించుకోగల పవన శక్తి ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతోంది. పునరుత్పత్తి చేయగల ప్రకృతి పవనం మనందరి జీవన ప్రమాణాలను పెంచుటలో దోహద పడుతుందని అశిద్దాం. భవిష్యత్తు ప్రత్యామ్నాయ తరగని శక్తి వనరుగా పవన శక్తిని ప్రోత్సహిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

యాసంగిలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు

మంచిర్యాల,జూన్15(ఆర్ఎన్ఎ): రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఈ యాసంగిలో పంటలు పుష్కలంగా పండాయని, కరోనా కారణంగా పంటల కొనుగోలులో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. అయినప్పటికీ మొత్తం పంట కొనుగోలు చేశామని చెప్పారు. వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చేందుకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ వంటి పథకాలు తెలంగాణలో మొట్ట మొదట ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఈ వానాకాలం ప్రభుత్వం సూచించిన పంటలు వేయాలని, 75 శాతం సన్నరకాలు , 25 శాతం దొడ్డురకం వడ్లు సాగు చేయాలని సూచించారు. పత్తి, కంది మొక్కజొన్న, జొన్న పంటలు సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం రైతుల కోసం రైతు వేదికలు, గోదాంలు నిర్మిస్తోందని తెలిపారు. రైతుల పంటలకు మద్దుతు ధర రాని పక్షంలో గోదాంలో నిల్వ చేసుకోవచ్చని నిల్వ చేసుకున్న పంటపై రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పు: గంగుల

కరీంనగర్,జూన్15(నేటినిజం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల విద్యుత్, రైతు బంధు, కాళేశ్వరం జలాలతో భూమికి బరువయ్యే పంట పండిందన్నారు. ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వర్షాకాలం లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్ అభివృద్ధి కోసం కేటాయించిన మొదటి వంద కోట్ల నిధుల నుండి కోటి రూపాయలను వెచ్చించి 300 సీసీ కెమెరాలు, 4 మెగా ఫిక్సెల్ సిసి, నెట్ వర్క్ వీడియో రికార్డు కెమెరాలు, ఎల్ఈడిలు కొనుగోలు చేశామని చెప్పారు. తెలంగాణ సర్కార్ అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ పాలనలో పల్లెల రూపురేఖలు మారాయన్నారు. ప్రతి ప్లలె అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ సర్కారు దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం పేదలకు చేరాలని పిలుపునిచ్చారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేందుకు రహస్యప్రాంతాలను ఎంచుకున్నా

నలువైపులా పోలీసులు చుట్టుముడుతుండటంతో బిత్తరపోతున్న మందుబాబులు

కరీంనగర్, జూన్ 15 (నేటినిజం ప్రతినిధి):బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు రహస్య ప్రాంతాలను ఎంచుకున్నా ఎటునుండైనా పోలీసులు వచ్చి చుట్టుముట్టేస్తుండటంతో బిత్తరపోతున్నారు. ఒకవైపు బ్లూకోల్స్, పెట్రోకార్ విభాగాలు, మరోవక్క డ్రోన్‌కెమెరాలతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తిస్తూ కరీంనగర్ కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీసులు కేసులు నమోదుచేస్తున్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.

జిల్లాల పునర్విజన అనంతరం ఏర్పాటైన కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌లో వివిధ రకాల నేరాల నియంత్రణలో భాగంగా 2016 అక్టోబర్ నుండి కొన్ని నిషేధాజ్ఞలు అమలవుతున్న విషయం విదితమే. బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించేందుకు రహస్యంగా తమ ఆనవాళ్ళు కనబడకుండా చర్యలు తీసుకుంటున్నా పోలీసులు పట్టేస్తుండటంతో దిక్కుతోచనిస్థితిలో పడిపోయారు. బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించి మద్యంప్రియులు మత్తులో పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తుంటంతో ఈ నిషేధాజ్ఞలను పగడ్బందీగా అమలుచేస్తున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించడం లాంటి నిషేధాజ్ఞలను కరీంనగర్ కమీషనరేట్‌లో పొడగించబడిన విషయం తెలిసిందే. మద్యంసేవించిన మత్తులో మందుబాబులు వీధుల్లో, రోడ్లపైకివచ్చి అసభ్యపదజాలంతో మాట్లాడుతుండటం అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందిగా మారింది. వీరి ఆగడాలకు కళ్ళెంవేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణకోసం ఈ నిషేధాజ్ఞనలను తప్పనిసరి పరిస్థితులలో పొడగించడం జరుగుతున్నది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈకాల పరిమితి మరింతపెంచే అవకాశం ఉంది. ఐప

ఏపిలో కొత్తగా 304 పాజిటివ్ కేసులు

వలస వచ్చే వారితోనే పెరుగుతున్న కేసులన్న రోజా

అమరావతి,జూన్15(ఆర్ఎన్ఎ): ఏపీ కరోనా కేసుల తాజా బులెటిన్‌ను వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసింది. ఏపీలో కొత్తగా 304 మందికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో ఏపీకి చెందిన వారు 246 మంది కాగా, ఇతర రాష్ట్రాలకు చెందిన 52 మంది, విదేశాలకు చెందినవారు 8 మంది కరోనా వైరస్ బారినపడ్డారు. గత 24 గంటల్లో 15, 173 శాంపిల్స్‌ను పరీక్షించగా 246 మంది కోవిడ్ -19 పాజిటివ్‌గా తేలారు. 47 మంది కోవిడ్ నుంచి తేరుకుని సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. కర్నూల్, అనంతపురం జిల్లాలలో ఒక్కొక్కరు మరణించారు. రాష్ట్రంలో నమోదైన మొత్తం 5087 కేసుల్లో 2770 మంది డిశ్చార్జ్ కాగా 86 మంది మరణించారు. ప్రస్తుతం 2231 మంది చికిత్స పొందుతున్నారు. కరోనా కేసుల విషయంపై ఎమ్మెల్యే రోజా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కేసులు పెరగడానికి పక్క రాష్ట్రాలే కారణమంటూ వ్యాఖ్యానించారు. పొరుగు రాష్ట్రాల్లో కరోనా పరీక్షలు చేయడం లేదని, పాజిటివ్ కేసులు నమోదైనా వారిని పట్టించుకోకుండా తరిమేస్తున్నారని అన్నారు. ఆయా ప్రాంతాల నుంచి ఏపీకి వస్తున్న వారి వల్ల ఇక్కడ కేసులు పెరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో కొత్తవారు కనిపిస్తే అడ్డుకోవాలని, అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా టెస్టింగ్ కియోస్క్ ప్రారంభించిన సందర్భంగా మాట్లాడిన రోజా.. ఇలా మాట్లాడడం చర్చనీయాంశమైంది. ఏపీలో వైరస్ వ్యాప్తి అరికట్టేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో చెప్పకుండా.. పక్క రాష్ట్రాల ప్రభుత్వాల్ని తిట్టడం విమర్శలకు తావిచ్చింది.

అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్ల పట్టివేత

నిర్మల్, జూన్ 15: జిల్లాలోని సారంగాపూ1ర్ మండలంలోని చించోలి వద్ద అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ శశిధర్ రాజు కథనం ప్రకారం.. బీదర్ నుంచి సారంగాపూర్ మండలానికి టీఎస్ 12యూసీ 5913 అనే నంబర్ గల లారీలో 160 సంచులు తరలిస్తూన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టి పెద్ద ఎత్తున గుట్కా ప్యాకెట్ల బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 13.34 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నలుగురి వ్యక్తులను అరెస్టు చేసి లారీని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ లింగమూర్తి హఠాన్మరణం

కరీంనగర్, జూన్ 15 (నేటినిజంప్రతినిధి): సిటి స్పెషల్‌బ్రాంచి విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాశపాక లింగమూర్తి(48) ఆదివారం నాడు రాత్రి హఠాన్మరణం చెందారు. అధికరక్తపోటుతో గతకొన్నిరోజుల నుండి ఇబ్బందిపడుతున్న ఆయన ఆదివారంరాత్రి బ్రేన్‌స్ట్రోక్‌తో మృతిచెందారు.

1992లో పోలీస్‌శాఖలో కానిస్టేబుల్ చేరిన ఆయన ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్‌గా సిఎస్‌బి విభాగంలో కొనసాగుతున్నారు. ఆయనకు భార్య,ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం మధ్యాహ్నం నీతారాంపూర్‌లోని స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలను అధికారికలాంఛనాలతో నిర్వహించారు. అడిషన్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, మానకొండూరు, జమ్మికుంట, కరీంనగర్ రూరల్ సిఐలు తుల శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, ఏ రాములు, ఆర్ఐలు మల్లేశం,జానీమియా, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు యం సురేందర్‌లతోపాటుగా పలువురు పోలీసుఅధికారులు, సిఎస్‌బి విభాగం సిబ్బంది తదితరులు ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలుఉంచి నివాళులర్పించారు.

బిజెపి విద్యుత్ ఆందోళన భగ్నం

ముందే నేతలను గృహనిర్బంధం చేసిన పోలీసులు
సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తోందన్న లక్ష్మణ్

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): విద్యుత్ బిల్లులపై ఆందోళన చేయాలనుకున్న బిజెపి నేతలను ఎక్కడికక్డ అరెస్ట్ చేశారు. ముందస్తుగా నేతలను గృహనిర్బంధం చేశారు. బీజేపీ నేతల ఇంటి దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. ప్రజలపై ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ బిల్లుల భారం మోపడంపై బీజేపీ రాష్ట్ర కమిటి నిరసన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని విద్యుత్ సౌధతో పాటు అన్ని జిల్లా కేంద్రాల ఎదుట ధర్నా చేయాలని పిలుపునిచ్చింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి గొడవలు జరకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం దగ్గర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఆ పార్టీ నేతలను హౌస్ అరెస్టు చేశారు. ఎమ్మెల్సీ రాంచందర్ రావు ను హైదరాబాద్ తార్నాకలోని తన ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు పోలీసులు. ముషీరాబాద్ అశోక్ నగర్ లో బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ ఇంటి దగ్గర పోలీస్‌లు మోహరిం చారు. సీఎం కేసీఆర్ నిజాం సర్కార్ లా వ్యవహరిస్తున్నారని బిజెపి నేత లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే? ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిరం కుశంగా వ్యవహరిస్తోం దన్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వేయడం,సకాలంలో చెల్లించని వారు ఇంట్రెస్టుతో బిల్లులు చెల్లించాలని అనటం సరైంది కాదన్నారు. వారంరోజులుగా పోరాటం చేస్తున్నా సర్కార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 300 రూపాయల విద్యుత్ బిల్లు వచ్చే వారికి 3వేలు బిల్లు వేశారన్నారు. ప్రజలు ఇబ్బందిలో ఉన్నప్పుడు ప్రజలకు ప్రభుత్వం మేలు చేయాలి కానీ.. ప్రజలపై భారం మోపేలా చేయవద్దని సూచించారు. ఇక పోలీసులను కల్వకుంట్ల సేవకు అన్నట్లు మార్చిన సీఎం కేసీఆర్‌కు త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. విద్యుత్ చార్జీల మాఫీపై జిల్లాలోని ఎంపీడీసీఎల్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వివేక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన్ను వరంగల్ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే... ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అదనపు విద్యుత్ చార్జీల పేరుతో రూ.800 కోట్ల భారం మోపుతో ందన్నారు. వారం రోజులుగా పోరాటం చేస్తున్నా సర్కార్ పట్టించుకోవడం లేదని విర్శించారు. విద్యుత్ బిల్లులు మాఫీ చేయా లని ఆయన డిమాండ్ చేశారు. రూ.300 వచ్చే వాళ్లకు రూ.3 వేలు బిల్లు వేశారని ఆరోపించారు. ప్రజలు ఇబ్బందిలో ఉన్నప్పుడు ప్రజలకు ప్రభుత్వం మేలు చేయాలని ఆలోచించాలి కానీ ప్రజలపై భారం మోపేలా కాదని హితవు పలికారు. ఎక్కువ బిల్లులు వేయడం, వడ్డీతో కట్టమనడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి నిజాం సర్కార్‌లా వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ కల్వకుంట్ల స్వవకు అన్నట్లుగా మార్చారన్నారు. సీఎంకు ప్రజలు తగిన గుణపాఠం చెబురని మాజీ ఎంపీ వివేక్ హెచ్చరించారు.

21న శ్రీవారి ఆలయంలో సూర్యగ్రహణం

తిరుమల,జూన్ 15 : శ్రీవారి ఆలయంలో జూన్ 21న ఉదయం 10:18 గంటల నుంచి మధ్యాహ్నం 1:38 గంటల వరకు సూర్యగ్రహణం ఉంటుందని టీటీడీ తెలిపింది. దీంతో జూన్ 20న రాత్రి 8:30 గంటలకు ఏకాంత సేవ తర్వాత ఆలయాన్ని మూసేస్తారు. సూర్యగ్రహణం ముగిసిన తర్వాత.. 21న మధ్యాహ్నం 2:30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు. అప్పట్నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుప్రభాతం, శుద్ధి, పుణ్యాహవచనం, తోమాల సేవ, కొలువు, బంగారు వాకిలి లోపల పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.అనంతరం మొదటి అర్చన, మొదటి గంట, బలి శాత్తుమొర, రెండో అర్చన, రెండో గంట తదితరాలను ఏకాంతంగా చేపడుతారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శుద్ధి, రాత్రి కైంకర్యాలు, రాత్రి గంట, రాత్రి 8 నుంచి 8:30 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు.

ఈ కైంకర్యాల కారణంగా జూన్ 21వ తేదీ నాడు పూర్తిగా శ్రీవారి ఆలయంలో భక్తులకు దర్శనం ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. కల్యాణోత్సవం ఆర్జితసేవను కూడా రద్దు చేసింది. గ్రహణం సమయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఇతర ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ ఉండదని భక్తులకు టీటీడీ సూచించింది.

ఆలస్యంగా అయినా టెస్టులకు ప్రాధాన్యం

పెరగనున్న కరోనా టెస్టులతో ప్రజలకు ఊరట
సర్కార్ నిర్ణయంతో కట్టడికి అవకాశాలు

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): ఆలస్యంగా అయినా తెలంగాణలో కరోనా టెస్టులపై సిఎం కెసిఆర్ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఎంతమందికైనా టెస్టులు చేసేందుకు సిద్ధమయ్యారు. నిజానికి టెస్టులు అంటూ జరిగితే కనీసం జాగ్రత్తలు అయినా పాటించడానికి వీలుంటుంది. పాజిటివ్ వచ్చిన వారి నుంచి మరొకరికి సోకకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. హైకోర్టు సహా, నిపుణులు హెచ్చరించి నప్పుడే ఈ చర్య తీసుకుని ఉంటే ఇప్పటికే సగం కంట్రోల్ అయి ఉండేది. అయితే ఇప్పటికైనా సానుకూల నిర్ణయం తీసుకోవడం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా చికిత్సలకు విధివిధానాలు రూపొందించాలను కోవడం మంచి పరిణామం. రాష్ట్రంలో ఎంతమందికి పాజిటివ్ వచ్చినా.. చికిత్స అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సిఎం కెసిఆర్ చేసిన ప్రకటన ప్రజలను ఊపిరి పీల్చుకునే చేసింది. టెస్టు కిట్లు, పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు, బెడ్లు, ఐసీయూ బెడ్లు, వెంటిలేటర్లు ఇలా అన్నీ సిద్ధంగా ఉన్నాయి. వైరస్ వ్యాప్తిని నివారించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొంటున్నాం. చికిత్స అందించే విషయంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో, అప్రమత్తతతో ఉన్నదని ప్రకటించారు. నిజానికి కరోనా మహమ్మారిని రాష్ట్రంలో కట్టుదిట్టంగా కట్టడిచేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గతంలోనే సిఎం కెసిఆర్ ప్రకటించారు. అయితే లాక్‌డౌన్ నడలింపులతో వలసకూలీల రాకతో కరోనా వ్యాప్తి పెరిగింది.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉందని ప్రభుత్వం బావిస్తోంది. మరణాల రేటు తక్కువగానూ, కోలుకుంటున్నవారి సంఖ్య చాలా ఎక్కువగానూ నమోదవుతున్నదని అంటున్నారు. అందుకే ఇంతకాలం కొంత నిదానంగా వ్యవహరించారు. అయినా కేసులు పెరగడంతో వారం, పదిరోజుల్లో హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లోని 30 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విపరీతంగా కేసులు నమోదు అవుతూ వస్తున్నాయి. దీంతో 50వేల మందికి కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు ల్యాబ్‌లు, ప్రైవేటు దవాఖానల్లో కొవిడ్ నిబంధనలను అనుసరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స చేయించుకోవడానికి అనుమతినిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలు, ధరలు నిర్ణయించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అయితే, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ఆ తర్వాత స్థానంలో సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలున్నాయి. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉన్నప్పటికీ, హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రతిరోజూ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. దీన్ని పూర్తిస్థాయిలో నివారించాల్సి ఉంది. వచ్చే వారం, పదిరోజుల్లో వైరస్ వ్యాప్తి జరుగకుండా ముందుజాగ్రత్త చర్యగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. సిఎం కెసిఆర్ ఆదేశాలతో ఇక ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 50 వేలమందికి వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వ దవాఖానలనే కాకుండా, ప్రైవేటు ల్యాబొరేటరీలు, దవాఖానలను కూడా వినియోగిం చుకోబోతున్నారు. ఇకపోతే ప్రజలు ఆందోళనపడాల్సిన అవసరంలేకుండా, ఎవరికివారు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా వృద్ధులు ఇంట్లోనే ఉండాలి. ఇతర తీవ్రమైన జబ్బులు ఉన్నవారు కూడా జాగ్రత్తగా ఉండటం అవసరం. రాష్ట్రంలో ఎంతమందికి పాజిటివ్ వచ్చినప్పటికీ అందరికీ చికిత్స అందించడానికి ప్రభుత్వం సర్వసిద్ధంగా ఉన్నది. హైదరాబాద్‌తో పాటు జిల్లాలకూ విస్తరిస్తోంది. ప్రభుత్వ సిబ్బందికి మాత్రమే కాదు.. అధికార పార్టీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కూడా వైరస్ సోకింది. తాజాగా మరో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు కూడా పాజివి-- అని తేలింది. వైరస్ కారణంగా మృతి చెందారనుకున్న వారికి కూడా పరీక్షలు జరిపించండని రాష్ట్ర హైకోర్టు గతంలోనే ఆదేశించింది. పరీక్షలు జరపడంతోపాటు వైరస్ బారిన పడినవారికి చికిత్స అందించడానికి ప్రైవేటు ఆసుపత్రులను కూడా అనుమతించండని న్యాయస్థానం సూచించింది. అటు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, ఇటు ప్రజల్లో బాధ్యతారహిత ధోరణితో వైరస్ విజృంభిస్తోంది. తాజా నిర్ణయంతో ఇప్పుడు కరోనా టెస్టులు పెరిగితే ప్రజలకు ఊరట దక్కనుంది.

చిట్టడవులు పెంపకంలో రాష్ట్రానికే ఆదర్శం కరీంనగర్ పోలీసులు

కరీంనగర్, జూన్ 15 (నేటినిజంప్రతినిధి): భవిష్యత్‌తరాలను దృష్టిలో ఉంచుకుని సమాజానికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు మియావాకి పద్ధతిలో చిట్టడవుల పెంపకానికి శ్రీకారం చుట్టడం రాష్ట్రానికే ఆదర్శమని జిల్లా కలెక్టర్ కె శశాంక అన్నారు. నాడు కాంక్రీట్ జంగిల్‌గా ఉన్న కరీంనగర్ నేడు చిట్టఅడవులకు నియలంగా మారడం పోలీసులు అంకితభావంతోచేస్తున్న కృషి, అకుంఠితదీక్షతో కొనసాగిస్తున్న మహోన్నతమైన కార్యక్రమమని పేర్కొన్నారు.

ఈనెల 20నుండి హరితహారం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం నాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డితో కలిసి సిటిపోలీస్ శిక్షణకేంద్రం(సిపిటిసి)లో మియావాకి పద్ధతిలో ఏర్పాటు చేయబడిన చిట్టడవులు పెంపకం కొనసాగిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఒక ఎకరం విస్తీర్ణంలో 12,500మొక్కలు నాటిన ప్రదేశంలోని మొక్కలు అభివృద్ధి చెందుతున్న తీరును పరిశీలించారు. ఐదునెలల కాలంలోనే ఏపుగా పెరిగిన మొక్కలనుచూస్తూ పెంపుదలకోసం తీసుకుంటున్న చర్యలను ఆసక్తిగా అడిగితెలుసుకున్నారు. మరోఆరునెలల వ్యవధిలో ఈ మొక్కలు పెంపకం కొనసాగుతున్న ప్రాంతం కాకులుదూరనికారడవిలా మారనుంది. గతంలో జరిగిన వివిధ హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు నేడు మహావృక్షాలుగా అవతరించాడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వివిధ దశల్లో కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మొక్కలు పెంపకానికి చేపట్టిన చర్యలను పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కలెక్టర్ కె శశాంకకు వివరించారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా నిరంతరం డ్రిప్‌విధానం ద్వారా నీరందుతున్న తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధరకాల కాలుష్యాలలతో మానవమనుగడకు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో పోలీసులు మొక్కల పెంపకం, సంరక్షించేందుకు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. అన్నివర్గాల ప్రజలు కరీంనగర్ పోలీసులను ఆదర్శంగా తీసుకుని తమవంతు భాద్యతగా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు స్వచ్ఛందంగా మొక్కలు నాటేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ జపాన్‌కు చెందిన వృక్షశాస్త్రవేత్త మియావాకి, మాజీరాష్ట్రపతి అబ్దుల్‌కలాం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లను స్ఫూర్తిగా తీసుకుని సమాజహితంకోసం మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టామని, జిల్లాకలెక్టర్‌తోపాటుగా తమవంతు సహకారాన్ని అందిస్తున్న వివిధశాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలకు చెందినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 20నుండి ప్రారంభంకానున్న హరితహారం కార్యక్రమంలో కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పిటిసి)ఆవరణలో 25వేల మొక్కలను నాటడంతోపాటు, కమీషనరేట్ వ్యాప్తంగా పోలీస్‌శాఖకు చెందిన స్థలాల్లో మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించేందుకు తీసుకునే చర్యలపై కార్యాచరణ రూపొందించామని వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ), సిపిటిసి ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, ఏసిపిలు శంకర్‌రాజు, శివభాస్కర్, అవుట్‌డోర్ ఇంచార్జి కిరణ్‌కుమార్‌లతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అరెస్టులపై రాద్ధాంతం ఎందుకు?

అవినీతి కేసులను విచారించడం సరికాదా
టిడిపీ సమాధానం ఇచ్చుకోవాల్సిందే

అమరావతి,జూన్15(ఆర్ఎన్ఎ): అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే కావాలి. అయితే ఆ దిశగా ఎవరు చర్యలు తీసుకున్నా స్వాగతించాల్సిందే. జగన్మోహన్‌రెడ్డి పాలన ఫ్యాక్షనిస్టు తరహాలో సాగుతోందన్న విమర్శలు చేస్తూ అచ్చెన్నాయుడు, జెసి ప్రభాకర్ రెడ్డిల కేసులను నీరుగార్చాలనుకోవడం సరికాదు. వారి అవినీతికి సంబంధించిన చర్చ చేయకుండా టిడిపి నేతలు ఎదురుదడాడి చేయడం సరికాదు. జగన్ ఒకవేళ ఫ్యాక్షనిస్ట్ అయితే అది వేరే వ్యవహారం. ఆయనను ప్రజలు ఎన్నుకుని ముఖ్యమంత్రిని చేశారు. కాబట్టి ఆయన అవినీతికి సంబంధించి విచారణకు ఆదేశిస్తే అది ప్రభుత్వ విధానంగానే చూడాలి. అచ్చెన్నా యుడు,జెసి ప్రభాకర్ రెడ్డిల అరెస్ట్ వంటివి వివాదాస్పదం చేయడం రాజకీయం కాక మరోటి కాదు. చంద్రబాబు నాయుడు అవినీతిని ప్రోత్సహిస్తే అంతకన్నా దారుణం మరోటి ఉండదు. అది జగన్‌ను కూడా అవినీతి చేయాలని ప్రోత్సహించడమే అవుతుంది. అచ్చెన్నాయుడు అరెస్టును సమర్థించుకోవడానికై అధికార పార్టీ నాయకులు పలు వ్యాఖ్యలు, హెచ్చరికలు జారీ చేశారు. దీంతో అచ్చెన్నాయుడు అరెస్ట్ మరింత రాజకీయం అయింది. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రభుత్వాలు అవినీతిపై పోరాడాల్సిందే. గతంలో ఎవరు అవినీతికి పాల్పడినా ఊచలు లెక్కించేలా చేయాల్సిందే.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అవినీతికి వకాల్తా పుచ్చుకున్నట్లుగా ఉన్నాయి. ప్రజలు మాకు అధికారం ఇచ్చారంటూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా నిరంకుశ పోకడలకు పోవడం వల్ల న్యాయస్థానాలు తరచుగా జోక్యం చేసుకోవలసి వస్తోంది. ప్రభుత్వాలకు బాధ్యత గుర్తుచేయాల్సి వస్తోంది. చట్టబద్ధమైన పాలనను అందించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలను కట్టడి చేయవలసిన కేంద్ర ప్రభుత్వం కూడా అజమాయిషీ లేకుండా చూస్తోంది. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంతో తమకు తిరుగులేని విధంగా, విపక్షం లేకుండా చేసుకోవడం సరికాదు. విపక్షాలను గౌరవించి వారి మాటలకు కూడా విలువ ఇవ్వాలి. సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలి. నియంతలను తలపింపజేసే విధంగా ముఖ్య మంత్రులు వ్యవహరిస్తే ప్రజలు ఎదురుతిరిగే పరిస్థితి రావచ్చు. అందువల్ల అధికారంలో ఉన్నప్పుడు నిజాయితీగా ఉంటూ..గతంలో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తే తప్పు లేదు. అలాగే గతంలో జరిగిన అవకతవకలపై విచారణను అడ్డుకోవాలని కోరుకోవడం కూడా అవినీతిని ప్రోత్సహించడం తప్ప మరోటి కాదు. శుక్రవారం తెలతెలవారుతూనే మాజీ మంత్రి అచ్చెన్నాయుడుని అరెస్ట్ చేయగా, శనివారం తెల్లవారుజామున మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. మందుల కొనుగోళ్లలో జరిగిన అవకతవకలతో అచ్చెన్నాయుడుకి సంబంధం ఉంటే విచారణ జరపాలి. ఆయనను అరెస్టు చేయడంలో తప్పులేదు. జేసీ ప్రభాకర్‌రెడ్డి విషయంలో కూడా అక్రమాలు జరిగి ఉంటే, ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందే. కుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. నిజంగా తప్పు చేసిన వాళ్లు కూడా తనను అక్రమంగా అరెస్టు చేశారనే చెబుతారు. గతంలో మాకూ ఎసిబి ఉందంటూ ఎమ్మెల్సీ కొనుగోళ్లకు సంబంధించిన సమయంలో చంద్రబాబు వ్యాఖ్యానించారు. అదే ఎసిబి ఇప్పుడు పనిచేస్తుంటే ఎలా కాదనగలరో చెప్పాలి.

కాణిపాకం ఆలయ ఉద్యోగికి కరోనా పాజిటివ్

రెండురోజులపాటు దర్శనాలు రద్దు

చిత్తూరు,జూన్15(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కాణిపాకంలో కరోన కలకలం సృష్టించింది. ప్రసిద్ధ వరసిద్ధి వినాయక ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డుకు కరోనా సోకింది. దీంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. రెండు రోజులపాటు దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. మొత్తం 60 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాటివ్‌గా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. ఈ నెల 11న తిరుమలలోని గోవిందరాజ స్వామి ఆలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు కరోనా సోకడంతో ఆలయాన్ని రెండు రోజులపాటు మూసివేశారు. ఆలయాన్ని శానిటైజేషన్ చేసిన తర్వాత 14వ తేదీ నుంచి భక్తులను అనుమతిస్తున్నారు. అదే జిల్లాలోని శ్రీకాళహస్తి దేవాలయాన్ని ఈ నెల 10న తెరవాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆలయ ప్రధాన అర్చకుడికి కరోనా పాజిటివ్ రావడంతో గుడిని మూసివేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 6163 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 84 మంది మరణించారు.

హైదరాబాద్ వదిలి విశాఖ వెళతారా?

చలనచిత్ర ప్రముఖుల తీరుపై అనుమానాలు

అమరావతి,జూన్15(ఆర్ఎన్ఎ): చిత్ర పరిశ్రమను తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు తరలించాలన్న ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి స్టూడియోలకు భూములు కేటాయించారు. పరిశ్రమకు చెందినవారికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. దశాబ్దం గడిచినా ఇళ్ల నిర్మాణం జరగలేదు. అప్పుడు అధికారంలోకి వచ్చిన ఎన్.టి.రామారావు వెంటనే ఇళ్లు కట్టుకోకపోతే ఇచ్చిన స్థలాలు వెనక్కి తీసుకుంటామని హెచ్చరించడంతో ఇప్పటి ఫిల్మ్‌నగర్ అభివృద్ధి చెందింది. ఎపి విడిపోయాక ఇప్పుడు ఎపిలోనూ చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేస్తామని అంటున్నారు. ఇటీవల సిఎం జగన్‌ను కలసిన వారు విశాఖలో భూములు ప్రస్తావన తెచ్చారు. వారంతా హైదరాబాద్÷-లో స్థిరపడ్డవారే. ఇప్పుడు విశాఖలో ఇళ్ల స్థలాలు కావాలను

కుంటున్నవారు హైదరాబాద్ వదిలి విశాఖలో ఇళ్లు కట్టుకుని స్థిరపడతామని చెప్పగలరా?అన్నది కావాలి. జగన్మోహన్‌రెడ్డిని కలిసినవారందరికీ హైదరాబాద్‌లో బ్రహ్మాండమైన భవంతులు ఉన్నాయి. తెలుగు ప్రజలు కరోనా వైరస్ కారణంగా ఇబ్బందులు పడుతుంటే చిరంజీవి నేతృత్వంలోని కొంతమంది సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసి తమకు విశాఖలో స్టూడియోల నిర్మాణానికి భూములు కేటాయిం చడంతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని కోరడం ఆశ్చర్యానికి గురి చేసింది. విశాఖలో దివంగత నిర్మాత రామానాయుడు నిర్మించిన స్టూడియో ఇప్పటికీ ఖాళీగానే ఉంది. కరోనా కారణంగా ముమ్ముందు సినిమాల భవిష్యత్ ఏమిటో తెలియని స్థితిలో భూములు అడగటం ఎలా సమర్థనీయమా అని విమర్శలు వచ్చాయి. హైదరాబాద్‌లో ఉన్న స్టూడియోలే షూటింగులు లేక వెలవెలబోతున్నాయి. ఇక విశాఖలో స్టూడియోల అవసరం ఉంటుందా? షూటింగులకు అనుమతులు కావాలని కేసీఆర్, జగన్‌లను అర్థించారు. మంచిదే గానీ పెద్ద హీరోలుగా చలామణి అవుతున్నవారు ప్రస్తుత పరిస్థితులలో షూటింగులకు ఇష్టపడటం లేదు. రాజధానిగా అమరావతినే కొనసాగిస్తానని జగన్ ప్రకటించి ఉంటే తమకు స్టూడియోల కోసం, ఇళ్ల స్థలాల క

ఉపాధి కూలీలకు మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

మాస్కులు కట్టుకుని పనిచేయాలని సూచన

వరంగల్ రూరల్,జూన్15(ఆర్ఎన్ఎ): ఉపాధి కూలీలకు కనీసం రూ.200 లకు తగ్గకుండా ప్రతి రోజూ వేతనం అందేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు.

అలాగే నమోదు చేసుకున్న వారందరికి పని కల్పించాలన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి నుంచి వరంగల్ జిల్లాకు వెళ్తున్న మంత్రి మార్గమధ్యంలో ఉప్పరపల్లి వద్ద ఆగి ఉపాధిహామీ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. కూలీలకు మాస్కులు పంపిణీ చేశారు. మాస్కులు ధరించాలని, కరోనా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజు వారీగా ఎంత మేరకు ఉపాధి లభిస్తున్నదని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడారు. కూలీలకు రోజుకు కనీసం రూ.200లకు తగ్గకుండా వేతనం లభించేలా చూడాలని ఆదేశించారు. ఆ మేరకు ఉపాధి కూలీలకు పనులు చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఉపాధి కూలీలకు అత్యధికంగా పని దినాలు కల్పిస్తున్నామని అన్నారు.

దేశంలో ఆందోళనకర స్థాయిలో కరోనా కేసులు

కొత్తగా 11,502 కరోనా పాజిటివ్ కేసులు నమోదు
గత 24 గంటల్లో 325 మరణాలు

న్యూఢిల్లీ,జూన్15(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. భారత్ లో కరోనా కేసులు జోరు చూపిస్తున్నాయి.. ఆదివారం దాదాపు 12 వేల కేసులు నమోదు కాగా.. ఇవాళ కాస్త తగ్గినా.. కేసుల సంఖ్య భారీగానే ఉంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా కరోనా హెల్త్ బులెటిన్ ప్రకారం.. గత 24 గంటల్లో 325 మరణాలు సంభవించగా.. కొత్తగా 11,502 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.. దీంతో మొత్తం కేసుల సంఖ్య 332424 కి చేరింది.. ప్రస్తుతం.. 153106 క్రియాశీల కేసులు ఉండగా.. 169798 మంది కరోనా నుంచి కోలుకొని ఇళ్లకు చేరారు.. తాజా మృతులతో కలుపుకొని.. ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 9520 కి చేరినట్టు కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే దేశ రాజధానిలో కరోనాను అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకుని సరైన చర్యలు తీసుకోలేకపోయిన మోదీ సర్కార్ ఇతర రాష్ట్రాలకు ఎలాంటి సహాయ సహకారాలను అందిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. కరోనాపై పోరు రాజకీయాలవైపు మళ్లింది కాని దేశంలో పరిస్థితి రెండు నెలలకు పూర్వం కంటే ఘోరంగా ఉన్నది. దేశ రాజధానిలో కరోనా మహమ్మారి ప్రవేశించని చోటు లేకుండా పోయింది. దేశ రక్షణ శాఖ కార్యదర్శి నుంచి ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ వరకు కరోనా వాతపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ అధినేత బలరాం భార్గవ, నీతీఆయోగ్ సభ్యుడు వినోద్ పాల్ తమ సహచరులకు కరోనా వచ్చిందని తేలడంతో క్వారంటైన్‌కు పరిమితమయ్యారు. ఈ పరిణామాలు సామూహిక వ్యాప్తి జరగడంలేదని ప్రభుత్వం చేస్తున్న వాదనల్ని తిప్పిగొడుతున్నాయి. మొత్తం రక్షణ మంత్రిత్వ శాఖనే శానిటైజ్ చేయాల్సి రాగా ఆర్మీ కేంద్ర కార్యాలయమే ఉద్యోగుల రాకపోకల్ని, ముఖాముఖి సమావేశాల్ని పరిమితం చేసింది. జులై నాటికి ఢిల్లీలో కరోనా కేసులు అయిదున్నర లక్షలకు చేరుకుంటాయని ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ వాసులకు తప్ప మరెవరినీ ఆసుపత్రుల్లో చేర్చుకోలేమని ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ ప్రకటించాల్సి వచ్చింది. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని అందర్నీ చేర్చుకుంటామని ప్రకటించారు. ఇప్పుడు మొత్తం కేంద్ర పాలనా వ్యవస్థలో కరోనాను అరికట్టే విషయంలో తీసుకున్న చర్యల గురించి స్తబ్దత నెలకొన్నది. పై నుంచి క్రింది వరకూ అందరూ శ్మశాన నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. పిఐబి ఇచ్చే పత్రికా ప్రకటనలు తప్ప మరే సమాచారమూ తమ ముఖతా చెప్పడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. అధికారులంతా ముఖం చాటేస్తున్నారు. మే 11 వరకూ ప్రతి రోజూ విలేఖరుల సమావేశాలు నిర్వహించిన కేంద్ర ఆరోగ్య, హోంమంత్రిత్వ శాఖ అధికారులు వారానికోసారి మాట్లాడతామని చెప్పి తప్పించుకున్నారు. ఆ తర్వాత వారానికోసారి కూడా వారు మాట్లాడడం మానేశారు. అధికార లెక్కల ప్రకారమే నెలరోజుల్లోనే కరోనా ఎంత తీవ్రంగా పెరుగుతున్నదో అర్థమవుతున్నది. కరోనా సోకిన వారి సంఖ్య తగ్గుముఖం పడుతోందని, అనుకున్నంత వేగంగా రెట్టింపు కావడం లేదని, గ్రాఫ్ పెరగడంలేదని రకరకాల గణాంక వివరాలు చెప్పి తొలుత పబ్లిసిటీకి పూనుకున్నవారు ఇప్పుడు మౌనం పాటించాల్సి వస్తోంది. సోమవారం ఒక్కరోజే దాదాపు పదివేల కేసులు నమోదయ్యాయి. ఇది రికార్డు స్థాయి కాగా ఒకే రోజు 331 మంది కరోనా సోకి మరణించడం కూడా రికార్డు స్థాయే. ముంబైలో కరోనా సోకిన వారి సంఖ్య చైనా లెక్కల్ని దాటిపోయింది. ప్రధానమంత్రి స్వంత రాష్ట్రమైన గుజరాత్ కరోనా కేసుల విషయంలో తమిళనాడును ముందుకు నెట్టి మూడో స్థానం నుంచి నాలుగో స్థానం చేరుకున్నది. అత్యధికంగా కరోనా సోకిన ప్రజలున్న దేశాల్లో మనం ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అమెరికా, బ్రెజిల్, రష్యా, బ్రిటన్ తర్వాత భారత దేశం అయిదో స్థానాన్ని చేరుకుంది. నెల రోజుల క్రితం స్పెయిన్‌లో నమోదవుతున్న కేసుల గురించి ఆందోళన చెందేవారం. ఇప్పుడు మన దేశం స్పెయిన్‌ను కూడా అధిగమించింది. నిజంగా పెద్ద ఎత్తున వ్యాధి నిర్ధారిత పరీక్షలు నిర్వహించి ఉంటే, నిజంగా ప్రాథమిక, సెకండరీ కాంటాక్టులను చిత్త శుద్ధితో కనిపెట్టి శాంపిల్స్ తీసుకుని ఉంటే కరోనా కేసుల విషయంలో ఇవాళ మనదే అగ్రస్థానమయివుండేది.

ఏ చట్టప్రకారం పెన్షన్‌లో కోత విధించారు?

ప్రభుత్వ ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నాయి
తెలంగాణ సర్కార్‌కు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వానికి ఏ చట్టం ప్రకారం విశ్రాంత ఉద్యోగుల పెన్షన్‌లో కోత విధించే అధికారం ఉందని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. రాజ్యాంగంలో గానీ, చట్టాల్లో గానీ, సుప్రీం కోర్టు తీర్పుల్లో గానీ ఎక్కడైనా ఉందా? అని తెలంగాణ ప్రభుత్వాన్ని నూటిగా ప్రశ్నించింది. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ కోతకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నట్టు ప్రాథమికంగా స్పష్టమవుతోందని పేర్కొంది. పింఛనులో కోత విధించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఆర్ ఎస్ చౌహాన్, జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు జోక్యంతో పింఛనులో కోతను 50 శాతం నుంచి 25 శాతానికి తగ్గించామని ధర్మాసనానికి తెలిపారు. అయితే, మిగతా 25 శాతం ఎప్పుడు చెల్లిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వాన్ని అడిగి చెబుతానని, అందుకు జులై 2 వరకు గడువు ఇవ్వాలని ఏజీ కోరారు. ఎలాంటి ఇతర ఆధారం లేని విశ్రాంత ఉద్యోగులు పింఛను కోత వల్ల ఇబ్బందులు పడుతున్నారని హైకోర్టు పేర్కొంది. కోత ఏమాత్రం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధంగా కనిపించడం లేదని అభిప్రాయపడింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, కేంద్రం కూడా జీఎస్టీ బకాయిలు చెల్లించడం లేదని ఏజీ తెలిపారు. కేంద్రం తప్పు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా చేస్తుందా? అని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటిస్తే తప్ప పింఛనులో కోత విధించరాదని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాలు, జీవోలు చట్టాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. పింఛను కోతను ఏ చట్టం లేదా సుప్రీంకోర్టు తీర్పుతో సమర్థించగలరో ఎల్లుండిలోగా తెలపాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణ బుధవారానికి వాయిదా వేసింది.

ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిని పరిశీలించిన అమిత్ షా

న్యూఢిల్లీ, జూన్ 15 : దేశ రాజధానిలో కరోనా వైరస్ వ్యాప్తి అధికమవుతున్న నేపథ్యంలో అటు కేంద్రం, ఇటు ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎప్పటికప్పుడు ఢిల్లీ అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహించి.. తగు సూచనలు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిని అమిత్ షా పరిశీలించారు. ఆ ఆస్పత్రి డాక్టర్లతో ప్రస్తుత పరిస్థితులపై కేంద్ర హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. సోమవారం ఉదయం ఢిల్లీలో కరోనా పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఢిల్లీ ప్రజలందరికీ కొవిడ్-19 టెస్టులు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అంతేకాకుండా కంటైన్‌మెంట్ జోన్‌లోని ప్రతి కుటుంబానికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేసినట్లు సమాచారం.

'ఏషియన్ పెయింట్స్' సురక్షిత పెయింటింగ్ సర్వీస్ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 15 ప్రముఖ ఏసియన్ పేయింట్ సంస్థ పెయింట్ చేసేందుకు నూతన మార్గాలకు పిలుపునిస్తోంది. సేఫ్ పెయింటింగ్ సర్వీసెస్‌ను ప్రవేశపెట్టింది. అందుకే దేశవ్యాప్తంగా అత్యుత్తమ పెయింటింగ్ సర్వీస్‌లతో పాటుగా సురక్షితకే మొదటి ప్రాధాన్యం అనేందుకు ఇది హామీనిస్తుంది. మీ ఆరోగ్యం ఇళ్ళ పట్ల సంరక్షణ వహించే బ్రాండ్‌గా ఏషియన్ పెయింట్స్ రెండు డిజిటల్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. పెయింటర్లు వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ఇవి రూపొందాయి. ఈ ఫిల్మ్ నూతన పెయింటింగ్ విధానాలను, సురక్షిత శిక్షణను తెలియ చేస్తున్నాయి. పని చేసే చోట ఇన్ఫెక్షన్లు సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో పెయింటర్లు పొందిన శిక్షణ కూడా ఇందులో ఉంటుంది. ఆకర్షణీయమైన రీతిలో రూపుదిద్దుకున్న రెండు భాగాల సిరీస్ డిజిటల్ ఫిల్మ్ ఒక పెయింటర్ జీవితం లోకి తొంగిచూసే అవకాశాన్ని మనకు అందిస్తుంది. ఈ మహమ్మారి కారణంగా వ్యవస్థలో బాగా ముప్పుకు గురయ్యే అవకాశాలు కలిగిందిగా, బాగా ప్రభావితమైందిగా పెయింటర్ల వర్గం ఉంది. పనులు పునరుద్ధరించేందుకు వారికి గల కారణాలను మనం చూస్తాం. తమ పెయింటర్ల కోసం ఏషియన్ పెయింట్స్ సేఫ్ పెయింటింగ్ సర్వీస్ చేపట్టిన సురక్షిత మరియు శానిటైజేషన్ చర్యలనూ చూయించారు. ఈ సందర్భంగా ఈ క్యాంపెయిన్ గురించి ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ అమిత్ సింగల్ మాట్లాడుతూ, ''ఏషియన్ పెయింట్స్ విశ్వాసాలు, విధానాల్లో కమ్యూనిటీ ఫస్ట్ అనేది ఒక భాగం. మా కార్యకలాపాలతో సంబంధం గలవారి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం అనేది ఎప్పుడూ మా ప్రాథమ్యంగా ఉంటోంది. ఇన్ఫెక్షన్ యొక్క ప్రస్తుత ముప్పు మా పెయింటర్లు, వారి కుటుంబాలు, వినియోగదారుల పట్ల మేము ఆందోళన చెందేందుకు ఓ కారణంగా మారిందనే విషయాన్ని మేము అర్థం చేసుకుని వారి పట్ల అంకిత భావంతో ఫిల్మ్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు అమిత్ సింగల్ తాము విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

సామాజిక చైతన్య కార్యక్రమాల్లో గౌడ సభ్యులు

హాస్టల్‌ను ప్రారంభించిన మంత్రులు

వరంగల్ అర్బన్,జూన్15(ఆర్ఎన్ఎ): మొదటి నుంచి గౌడ సామాజిక వర్గం సామాజిక చైతన్య కార్యక్రమాల్లో ముందున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం కూడా వారికి అండగా ఉంటోందన్నారు. వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నామని అన్నారు. హన్మకొండలోని హంటర్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన కాకతీయ గౌడ హాస్టల్ భవనాన్ని మంత్రులు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక, విద్యాభివృద్ధి, సామాజిక చైతన్యం, ఎదుగుదల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేయడం గర్వకారణ మన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు, వ్యాపార రంగంలో రాణించిన ప్రతి ఒక్కరూ వారి సామాజిక వర్గం అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. నీరాను త్వరలో అందుబాటులో తీసుకు వస్తామని తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి సీఎం కేసీఆర్ ఎంతో చేస్తున్నారన్నారు. ఐక్యతతో ఇంతపెద్ద కాకతీయ గౌడ హాస్టల్ భవనాన్ని నిర్మించిన సంఘం ప్రతినిధులను అభినందించారు.

అధికార పార్టీలో కరోనా కలకలం

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌కు పాజిటివ్
ఆందోళనలో పార్టీ కార్యకర్తలు

నిజామాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): అధికార పార్టీ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కరోనా వెంటాడుతోంది. తాజాగా టీఆర్ఎస్ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే బిగాల గణెశ్ గుప్తకు కరోనా పాజిటివ్ అని తేలింది. స్వల్ప అస్వస్థతకు గురైన ఆయన.. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కరోనా టెస్ట్ చేయించుకున్నారు. ఈ టెస్టుల్లో ఆయనకు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆ ఆస్పత్రిలోనే ఆయన చికిత్స పొందుతున్నారు. కాగా, ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కి కరోనా పాజిటివ్ వచ్చింది. అయితే జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలకు కరోనా పాజిటివ్ అని తేలడంతో వారిని కలిసిన అధికారులు, పార్టీ నేతలు ఆందోళనలో ఉన్నారు. కాగా, ఎమ్మెల్యే బిగాల కూడా ముత్తిరెడ్డిని కలిసినట్లు తెలుస్తోంది. ఆయన నుంచే బిగాలకు కరోనా సోకి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం ఆ హాస్పిటల్ లోనే ఆయన ట్రీట్ మెంట్ తీసుకుంటున్నట్లు సమాచారం.

భారత భూభాగాలను చేర్చుతూ కొత్త మ్యాపు

-ఆమోదించిన నేపాల్ పార్లమెంట్

ఖాట్మండు,జూన్15(ఆర్ఎన్ఎ): కొత్తగా తీసుకొచ్చిన పొలిటికల్ మ్యాప్‌కు నేపాల్ పార్లమెంట్ ఆమోదముద్ర వేసింది. ఈ మ్యాప్‌లో దాదాపు 370 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల భారత భూభాగానికి చెందిన భూమి ఉన్నది. భారత భూభాగంలోని లిపులేక్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాలు తమ దేశ అంతర్గత ప్రాంతాలని వాదిస్తూ నేపాల్ ఈ కొత్త మ్యాప్ తీసుకొచ్చింది. ఈ మ్యాప్‌పై రాజ్యాంగ సవరణకు నేపాల్ పార్లమెంట్ శనివారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ వివాదాస్పద అంశంలో విపక్షాల మద్దతు కూడగట్టేదుకు ఇదివరకు ఒకసారి ఆ దేశ ప్రధాని కేపీ శర్మ ఓలీ విఫలమయ్యారు. దాంతో శనివారం ఎలాగైన రాజ్యాంగ సవరణ చేయాలన్న పట్టుదలతో ప్రత్యేకంగా పార్లమెంట్‌ను సమావేశపరిచి చర్చ జరిపిన మీదట కొత్త మ్యాప్‌కు ఆమోదం తెలిపారు. దిగువ సభలో కొత్త మ్యాప్‌కు ఆమోదం నేపథ్యంలో.. తదుపరి ఎగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీకి పంపిస్తారు. అక్కడ కూడా ఆమోదం పొందితే అప్పుడు అధ్యక్షుడి ఆమోదం కోసం పంపుతారు. ఆయన ఆమోదించిన తరువత రాజ్యాంగంలో పొందుపరుస్తారు. భారత్, నేపాల్ సరిహద్దుల్లోని కాలాపానీ, సమీపంలోని లిపులేక్ పాస్ పశ్చిమ స్థానంలో ఉన్నది. కాలాపానీ ప్రాంతం తమదంటే తమదంటూ రెండు దేశాలు వాదిస్తున్నాయి. కాలాపానీ భూభాగం ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గడ్ జిల్లా పరిధి లోకి వస్తుందని భారత్ పేర్కొంటుండగా.. ధార్చుల జిల్లా పరిధిలోని భూభాగమని నేపాల్ వాదిస్తోంది. రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై తీవ్ర ఉద్రిక్తతల మధ్యనే బిల్లు తాజాగా ఆమోదించడం విశేషం.

16న కలెక్టర్లతో సిఎం కెసిఆర్ సమావేశం

-ప్రగతిభవన్‌లో వివిధ అంశాలపై చర్చ

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 16వ తేదీన రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నారు.

వ్యవసాయం, ఉపాధి హామీ పనులు,హరితహారం సహా ఇతర అంశాలపై వారితో చర్చించ నున్నారు. ప్రగతి భవన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి స్థానిక సంస్థల బాధ్యతలు చూస్తున్న అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులతో వీలైనన్ని ఎక్కువ శాఖల్లో ఎక్కువ పనులు చేయాలనే అంశంపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. సంబంధించిన అంశాలపై చర్చించి కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. నియంత్రిత సాగు, రైతు వేదికల నిర్మాణం, ప్లాట్ల, పట్టణ ప్రగతి, కరోనా, సీజనల్ వ్యాధుల నివారణ సహా ఇతర అంశాలు సమావేశంలో చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

బైకును ఢీకొన్న ట్యాంకర్

ఫారెస్ట్ కూలీ అక్కడిక్కడే మృతి

నల్లగొండ,జూన్15(ఆర్ఎన్ఎ): నార్కట్‌పల్లి మండల పరిధిలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. చెర్వుగట్టు గ్రామానికి చెందిన వనం భిక్షమయ్య (53) అటవీశాఖలో కాంట్రాక్టు కూలిగా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం నార్కట్‌పల్లికి చెందిన చెరుకుపల్లి కిరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై న్యూ వివేరా హోటల్ వద్ద రహదారి వెంట మొక్కలను పరిశీలించి తిరిగి నార్కట్‌పల్లికి వస్తుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళున్న ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న భిక్షమయ్య ట్యాంకర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

ఆడబిడ్డల కుటుంబాలకు అండగా 'కల్యాణలక్ష్మి' : ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ ,జూన్ 15: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డల కుటుంబాలను ఆదుకుంటుందని ఎమ్మెల్యే నమోతు భాస్కర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడవిదేవులపల్లి మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

బాధితులకు న్యాయం చేయటానికి ప్రజాదివాస్

-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

వేములవాడ, జూన్ 15 (నేటినిజం ప్రతినిధి): జూన్ బాధితులకు న్యాయం చేయటానికి ప్రజాదివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాజన్న జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉ .11 గంటల నుండి మధ్యాహ్నం 02గంటల వరకు జరిగిన ప్రజా దివాస్ లో ఎస్పీ రాహుల్ ప్రజల నుండి 14 ఫిర్యాదులు సేకరించినట్టు ఎస్పీ తెలిపారు .

ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

ఫిర్యాదులు పెన్డింగ్ పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఎస్ హెచ్ ఓలను ఆదేశించినట్లు చెప్పారు. సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.

భూమిని నమోదు చేయమని లేదా పొరపాటు వివాదాలకు పాల్పడాలని, పరిష్కారాలు చేయమని పొరులను ఎవరైనా బెదిరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి సంఘటనలకు సంబంధించి ప్రజలు మా కార్యాలయానికి వచ్చి పిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఘనంగా జరిగిన జడ్పీటీసీ నాగం కుమార్ జన్మదిన వేడుకలు..

జన నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు....

వేములవాడ, జూన్ 15 (నేటినిజం ప్రతినిధి): ఈరోజు చందుర్తి మండలం జోగపూర్ గ్రామంలో శ్రీ సీతా రామాలయంలో చందుర్తి జడ్పిటిసి, జోగాపూర్ గ్రామ నివాసి నాగం కుమార్ గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పిటిసి గారి కుటుంబ సభ్యులు మరియు అభిమానుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. జడ్పీటిసి గారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుని ఆశీర్వాదం, చందుర్తి మండల ప్రజల అండదండలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మ్యాకల గణేష్, ఉపసర్పంచ్ గంట మల్లేశం, వార్డు సభ్యులు వరికేల ముకుందం, చింతం శంకర్, మ్యాదరి ఇందిరా మనోహర్, మామిడి గౌతమి నరేష్, నాగం గణేష్, కోఆప్షన్ మ్యాదరి దేవయ్య, సీనియర్ నాయకులు గాజుల లక్ష్మణ్, ఎండి సలీం, వేముల శ్రీనివాస్, బోరుగాయా తిరుపతి, ఎండి రఫీ, ఎండీ గౌస్ ఫాష, ఎండి సాదిక్, మారుపాక దేవరాజు, ముత్యాల హరీష్, అమరబండ సాయికుమార్, గొల్లపల్లి సతీష్ గౌడ్, పల్లి ప్రశాంత్ గౌడ్, కోరే పర్షరాములు, పెంటల బీరయ్య, కాదసు శ్రీనివాస్, నాగం దిలీప్, కోరే కమలాకర్, కొత్తపల్లి దిలీప్, అమరబండ మధు, అమరబండ శ్రీకాంత్, పెద్ది వేణు కుమార్, తొంటి శ్రీనివాస్, తొంటి ప్రవీణ్, నాగం మురళి కృష్ణ, వోద్యరపు వేణు కుమార్, వాసు, ఎండి షఖీల్, ఎండి హైమద్, నవకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఖజానా నింపుకోవడానికే తప్పుడు విద్యుత్ బిల్లులు

ప్రతిపక్షాలను అడ్డుకోవడం సరికాదు: బండి సంజయ్

హైదరాబాద్,జూన్15(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ఖాజానా నింపుకునేందుకే తప్పుడు విద్యుత్ చార్జీలు విధించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. స్లాబ్‌ల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తుందన్న ఆయన.. కేసీఆర్ వడ్డీ వ్యాపారిలా వ్యవహరిస్తున్నారన్నారు. కరోనా కట్టడి కోసం కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఇస్తే.. కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు శాంతియుతంగా ఆందోళన చేస్తే, నిర్బంధం విధిస్తూ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ ఛార్జీల విషయంలో ప్రభుత్వ తీరును ఆయన దుయ్యబట్టారు. వేలల్లో బిల్లులు వస్తే ఎలా కడతారని అన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు బీజేపీ ఉద్యమిస్తుందని.. ఈ బిల్లులు మొత్తం ప్రభుత్వమే భరించాలన్నారు. లాక్‌డౌన్ తో ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే.. విద్యుత్ చార్జీల పేరుతో వసూల్ చేయడం దారుణమన్నారు. రూ. 3వందల కోట్లను ప్రజల నుంచి వసూలు చేయాలని కేసీఆర్ సర్కార్ కుట్ర పన్నిందన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ విధించాలి: ధర్మపురి

ఇదిలావుంటే తెలంగాణలో హెల్త్ ఎమర్జన్సీ పెట్టాలని ఎంపీ ధర్మపురి అరవింద్ సూచించారు. కరెంట్ బిల్లులతో కాళేశ్వరం కట్టాలని సీఎం కేసీఆర్ చూస్తున్నారన్నారు. బెర్రరిస్టుల మాదిరి బీజేపీ నాయకుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పెంచిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మ